


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 182 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | ఆదివారం 8 మార్చి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :182 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | SUN 8 MARCH 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## కొత్తగా ఆలోచించే వారి కోసం

# ‘క్రియేటివ్ సిటీ’

### సీఎం చంద్రబాబు ప్రకటన



- ఢిల్లీలో రైసినా డైలాగ్-2026 సదస్సు
- ఈ సదస్సుకు హాజరైన తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఘనత
- త్వరలో అమరావతి వేదికగా గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటు
- సాంకేతికతతో భారత్‌కు రివర్స్ మైగ్రేషన్ తప్పదని సీఎం వెల్లడి
- దక్షిణాదిలో తగ్గుతున్న జననాల రేటును పెంచేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

పెన్ పవర్ డెస్క్:“విభిన్నంగా ఆలోచించే వారి కోసం, సృజనాత్మకతకు పెద్దపీట వేసే మేధావుల కోసం అమరావతిలో అత్యాధునికమైన ‘క్రియేటివ్ సిటీ’ని నిర్మిస్తున్నాం. కేవలం పరిపాలనా నగరంగా మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం” అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక ‘రైసినా డైలాగ్–2026’ సదస్సులో పాల్గొన్న ఆయన, తన ప్రసంగంలో అమరావతి అభివృద్ధికి సంబంధించి కీలక విషయాలను ప్రపంచ దేశాల ప్రతినిధులతో పంచుకున్నారు. అమరావతిలో కేవలం భవనాలు మాత్రమే ఉండవని, అక్కడ డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ సిటీ వంటి భవిష్యత్ ఆధారిత రంగాలు కొలువుదీరుతాయని

మిగతా 2లో



## జగన్ ను ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారు

- తిరుమల లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెప్పారన్న సజ్జల
- తమ హయాంలో తిరుమలలో క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని వెల్లడి
- బీఆర్ నాయుడు విషయంలో చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ ను రాజకీయంగా ఎదుర్కోలేకే ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల లడ్డూ ప్రసాదంపై కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.లడ్డూ ప్రసాదంలో జంతువుల

మిగతా 2లో



## జగన్ మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది

- ప్రజలను వంచించడానికే ఆ హామీ అన్న లోకేశ్
- ప్రతి నెల రూ. 100 కోట్ల ముడుపులు అందాయని ట్వీట్
- రూ. 3,500 కోట్ల లాండరింగ్ జరిగిందన్న లోకేశ్

పెన్ పవర్ డెస్క్:గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన ‘మద్య నిషేధం’ హామీ వెనుక అసలు కథ వేరే ఉందని, ఆ హామీ కేవలం ప్రజలను వంచించడానికేనని లోకేశ్ ఆరోపించారు. ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకుని, గత ఐదేళ్లలో జరిగిన అవినీతి చిట్టాను ఆయన బయటపెట్టారు. ఈ మేరకు జాతీయ మీడియాలో వచ్చిన కథనాల క్లిప్పింగ్ లను కూడా లోకేశ్ తన ట్వీట్ లో పంచుకున్నారు.మద్యం వ్యాపారం ద్వారా ప్రతి నెలా సుమారు వంద కోట్ల రూపాయల మేర ముడుపులు అందాయని, మొత్తంగా 3,500 కోట్ల రూపాయల మేర మనీ లాండరింగ్ జరిగిందని

మిగతా 2లో

## హార్ముజ్ జలసంధిలో ఆయిల్ ట్యాంకర్‌పై

# ఇరాన్ దాడి...

### మరింత ముదిరిన ఉద్రిక్తతలు

- హార్ముజ్ జలసంధిలో ‘ప్రైమా’ అనే ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి
- హెచ్చరికలు పట్టించుకోకపోవడంతో డ్రోన్‌తో విరుచుకుపడ్డ ఆర్మీ
- శత్రు దేశాల నౌకలకు జలసంధిలో అనుమతి లేదన్న ఇరాన్
- గత ఎనిమిది రోజులుగా జలసంధి తమ ఆధీనంలోనే ఉందన్న ఐఆర్‌జీసీ
- జలసంధిని పూర్తిగా మూసివేయలేదని ఇరాన్ ప్రభుత్వం స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ హార్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. శనివారం హార్ముజ్ జలసంధి గుండా వెళుతున్న ‘ప్రైమా’ అనే ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషన్ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) దాడి చేసింది. తమ హెచ్చరికలను బేఖాతరు చేసినందుకే ఈ నౌకపై దాడి చేశామని ఇరాన్ సైన్యం ప్రకటించింది.

మిగతా 2లో



## ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్

- డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో లక్ష్మీదుర్గను ఏ-2గా చేర్చిన సిట్ అధికారులు
- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం ఎస్సీ ఎస్టీ కోర్టులో ఛార్జిషీట్
- కోర్టు ఆదేశాలతో లక్ష్మీ దుర్గ కోసం ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో శనివారం కీలక పరిణామం చోటుచేసు కుంది. ఈ కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గకు రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.

మిగతా 2లో





## చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం

- జయసుధకు ఏఎన్నార్ అవార్డు
- ఉత్తమ చిత్రం - రాజు వెడ్స్ రాంబాయి
- ఉత్తమ నటుడు - నాగ చైతన్య (తండేల్)
- ఉత్తమ నటి - రష్మిక (ది గర్ల్‌ఫ్రెండ్)
- ఉత్తమ దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)

పెన్ పవర్ డెస్క్:2025లో విడుదలైన చిత్రాలకు సంబంధించి ‘గద్దర్ ఫిలిం అవార్డ్స్–2025’ విజేతలను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. జ్యూరీ సభ్యులు విజేతల పేర్లను ప్రకటించారు. మెగాస్టార్ చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ పురస్కారంతో సత్కరించనున్నారు. 2025 జనవరి 1 నుంచి

మిగతా 2లో



## చంద్రబాబు పాపులేషన్ పాలసీపై షర్మిల సెటైర్

- చంద్రబాబు జనాభా విధానంపై వైఎస్ షర్మిల వ్యంగ్యం
- ఉన్న పిల్లలకే దిక్కులేదు.. ఇప్పుడు ముగ్గురు ఎందుకని ప్రశ్న
- నిరుద్యోగులు ఆటోలు, ట్యాక్సీలు నడుపుకుంటున్నారని ఆవేదన
- రాష్ట్ర అప్పులు 12 లక్షల కోట్లకు చేరాయని మండిపాటు


పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు జనాభా నియంత్రణ ఎత్తివేత, ఎక్కువ మంది పిల్లలను కనడంపై అసెంబ్లీలో చేసిన ప్రకటన పట్ల ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యంగ్యంగా స్పందించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతుంటే, ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనమని చెప్పడం ఎంతవరకు

మిగతా 2లో


## భారత్‌లో పెరిగిన బిలియనీర్ల సంఖ్య...

- ప్రపంచంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న మూడో దేశంగా భారత్
- గతేడాదితో పోలిస్తే కొత్తగా చేరిన మరో 24 మంది కుబేరులు
- ఏకంగా రూ.112.6 లక్షల కోట్లకు చేరిన మొత్తం సంపద
- హెల్త్‌కేర్ రంగం నుంచే అత్యధికంగా కొత్త బిలియనీర్లు
- ఆసియా బిలియనీర్ క్యాపిటల్ హోదాను కోల్పోయిన ముంబై

పెన్ పవర్ డెస్క్:భారత్‌లో సంపన్నుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. తాజాగా విడుదలైన ‘హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్–2026’ ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా తర్వాత భారత్ ఈ ఘనత సాధించింది. ప్రస్తుతం దేశంలో మొత్తం 308 మంది బిలియనీర్లు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. దేశంలో సంపద సృష్టి, ఆర్థిక వృద్ధి బలంగా ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి



మిగతా 2లో



## సుందర్ పిచాయ్ కి 63 వేల కోట్ల జీతం!

- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు భారీ వేతనం.. ప్రపంచంలోనే అత్యధిక జీతం!
- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు భారీ వేతన ప్యాకేజీ ప్రకటన
- రాబోయే మూడేళ్లలో రూ. 6,361 కోట్లు ఆర్జించే అవకాశం
- కంపెనీ పనితీరు ఆధారంగా రెట్టింపు కానున్న స్టాక్ యూనిట్లు
- వేమో, వింగ్ వంటి అటానమస్ వెంచర్ల వృద్ధికి ప్రోత్సాహకాలు

మిగతా 2లో



## ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి

- ఎనిమిదో రోజుకు చేరుకున్న యుద్ధం
- ఇప్పటి వరకు చేసిన దాడికి ‘సారీ’ అన్న పెజెష్కియాన్
- గల్ఫ్ దేశాలపై ఇక దాడులు చేయబోమన్న అధ్యక్షుడు
- పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం ప్రతిదాడి చేస్తామని హెచ్చరిక

## ఎడిటర్ వ్యూ

# గల్ఫ్ బాధితులకు రక్షణ ఏదీ?

ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ దాడులతో పశ్చిమాసియా దేశాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. భీకర యుద్ధం జరుగుతున్న ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో సుమారు కోటి మంది భారతీయులు భిక్కుభిక్కుమంటూ దినమెక గండంగా గడుపుతున్నారు. గల్ఫ్ దేశాల్లో అత్యధికంగా యూఏఈ (దుబాయి)లో 43 లక్షలు, సౌదీ అరెబియాలో 27 లక్షలా 47 వేలు, ఖతార్, కువైట్..ఇలా ఆయా దేశాల్లో లక్షల సంఖ్యలో మన భారతీయులు ఉద్యోగ, ఉపాధి కోసం వలస వెళ్లినట్లు లెక్కలు చెబుతున్నాయి. నిత్యం మిసైళ్ల వర్షం కురుస్తున్న ఇజ్రాయిల్, ఇరాన్ దేశాల్లోనూ యాభై వేల మంది వరకు భారతీయులున్నట్లు అంచనా. ఈ రెండు దేశాల్లో మరింత భయానక వాతావరణం నెలకొన్నట్లు స్పష్టమౌతుంది. రానున్న రోజుల్లో మరింత భీకర యుద్ధం జరిగే అవకాశాలున్నట్లు ప్రస్తుత పరిస్థితులను బట్టి అర్థం చేసుకోవచ్చు. పొట్ట చేతపట్టుకుని గల్ఫ్ దేశాలకు వెళ్లిన భారతీయుల్లో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి వారే ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో రోజు వారి కూలీగా చేరిన వారే ఎక్కువగా ఉన్నారు. షిప్పింగ్, పోర్టు కంపెనీల్లో భారతీయులు పనిచేస్తున్నారు. వారి పరిస్థితి ముందు నుయ్యి–వెనుక గొయ్యిలా మారింది. ఇప్పటికే దాడుల్లో ముగ్గురు భారతీయులు మృతి చెందినట్లు వార్తలొచ్చాయి. యుద్ధ వాతావరణంలో బయట పనులు చేయలేని పరిస్థితులున్నాయి. ఈ పరిస్థితుల్లో వారి జీవన మనుగడ అత్యంత క్లిష్టంగా మారినట్లు తెలుస్తోంది. స్వస్థలాల్లో అప్పులు చేసి గల్ఫ్ దేశాలకు వెళ్లిన భారతీయులకు ప్రస్తుత యుద్ధవాతావరణంలో మన ప్రభుత్వాల నుండి భరోసా లభించడం లేదు. ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలంగాణ వాసులు తమ కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో యూఏఈ పాలకులు ప్రవాసీయులకు కొంత భరోసా కల్పిస్తున్నారు. విమానాలు రద్దయినందున ఆయా హోటళ్లు, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని బలవంతంగా ఖాళీ చేయించవద్దని ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్కడి ప్రజలకు కొంత సహకారం అందిస్తున్నారు. కాగా..మన భారత ప్రధాని పలు దేశాధినేతలతో ఫోన్లో మాట్లాడినట్లు వార్తలు వచ్చాయి. ఢిల్లీలో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. వీటితో చేతులు దులుపుకున్నట్లు తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో ఉన్న భరతీయులకు రక్షణతో పాటు ఇక్కడి కుటుంబాలకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలేవీ కనిపించక పోవడం బాధాకరం. గల్ఫ్ దేశాల్లో భారతీయులు తీవ్ర భయాందోళనలో భిక్కు భిక్కుమంటూ గడుపుతున్న నేపథ్యంలో భారత ప్రధాని పుదుచ్చెరి, తమిళనాడు, కెనడా పర్యటనలు చేశారు. కేంద్ర మంత్రులు సైతం సొంత నియోజక వర్గాల పర్యటనలకే పరిమితమైనట్లు తెలుస్తోంది. దీంతో ఆయా దేశాల్లోని భారతీయుల బాగోగులు పట్టించుకునే వారే కరువయ్యారనే విమర్శలున్నాయి. దేశ వ్యాప్తంగా ఆయా పార్లమెంటు నియోజక వర్గాల వారీగా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి..ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడి భరోసా ఇచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. దీంతో పాటు గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులకు రక్షణతో పాటు అహారం, ఇతర అవసరాలు తీర్చేలా కార్యచరణ చేపట్టాల్సి ఉంది. ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావం భారత్‌పై ఏ మేరకు పడుతుందనే అందోళన నెలకొంది. ప్రధానంగా హోర్మూజ్ జలసంధి మూసివేతతో చమురు ట్యాంకర్ల నిలిపివేత ప్రభావం ధరల పెరుగుదలకు కారణమయ్యే అవకాశాలున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే బ్యారెల్ ధర 80 డాలర్లకు పెరిగిందని, క్రమ క్రమంగా మరింత పెరిగే అవకాశాలు లేక పోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచబోమనే కేంద్ర ప్రభుత్వ ప్రకటన కోసం దేశ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పెట్రో ఉత్పత్తులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాభై శాతం వ్యాట్‌ను వసూలు చేస్తున్నందున ప్రపంచ మార్కెట్‌లో క్రూడ్ అయిల్ ధర పెరిగినా నష్టాలు మాత్రం వచ్చే అకాశాలు లేవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ బహిరంగ మార్కెట్‌లో పెట్రో ధరలను ప్రభుత్వం పెంచితే..అనివార్యంగా సరుకులు, వస్తువుల ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉంది. ఈ ప్రభావం దేశవ్యాప్త ఆందోళనలకు దారితీసే అవకాశాలున్నాయి.

## జగన్ ను ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

కొవ్వు, కెమికల్స్ కలిపారంటూ చంద్రబాబు చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలని సజ్జల కొట్టిపారేశారు. వైసీపీ హయాంలోనే తిరుమలలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. మార్కెట్‌లో హెరిటేజ్ నెయ్యి ధర కంటే ఇందాపూర్, అమూల్ నెయ్యి ధరలు తక్కువగా ఉన్నాయని... కేవలం కొన్ని సంస్థలకు లబ్ధి చేకూర్చడానికే నెయ్యి కాంట్రాక్టుల విషయంలో చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. నెయ్యి కాంట్రాక్టుల వెనుక భారీ ఆర్థిక కుంభకోణం దాగి ఉందని, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని సజ్జల డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసి స్వామివారి సొమ్మును దోచుకోవడమే ఈ విష ప్రచారం వెనుక ఉన్న అసలు ఉద్దేశమని విమర్శించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి సంబంధించిన వీడియోల వివాదంపై సజ్జల స్పందిస్తూ... గతంలో తమ హయాంలో సినీ నటుడు పృథ్వీపై ఆరోపణలు రాగానే తక్షణమే రాజీనామా చేయించామని, కానీ ఇప్పుడు బీఆర్ నాయుడి విషయంలో చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీఆర్ నాయుడు తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భక్తుల విశ్వాసాలపై చంద్రబాబుకు విశ్వాసం లేదనే విషయం మరోసారి అర్థమయిందని అన్నారు.

# సుందర్ పిచాయ్ కి 63 వేల కోట్ల జీతం!

టెక్ దిగ్గజం గూగుల్ సీఈఓ, భారత సంతతికి చెందిన సుందర్ పిచాయ్ ప్రపంచంలోనే అత్యధిక వేతనం అందుకుంటున్న ఎగ్జిక్యూటివ్‌లలో ఒకరిగా నిలిచారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్, ఆయనకు రాబోయే మూడేళ్ల కాలానికి గాను ఏకంగా 692 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 6,361 కోట్లు) భారీ వేతన ప్యాకేజీని ప్రకటించింది. ఈ విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది. ఈ ప్యాకేజీ ఆయన పనితీరు, కంపెనీ వృద్ధి లక్ష్యాలతో ముడిపడి ఉండటం విశేషం. ఈ భారీ ప్యాకేజీలో ఎక్కువ భాగం పెర్ఫార్మెన్స్ స్టాక్ యూనిట్ల రూపంలో ఉంది. దీని విలువ 126 మిలియన్ డాలర్లు. ఎస్‌అండ్‌పీ 100 సూచీలోని ఇతర కంపెనీలతో పోలిస్తే ఆల్ఫాబెట్ షేర్ హోల్డర్లకు లభించే రాబడి ఆధారంగా ఈ ప్యాకేజీ విలువ మారుతుంది. కంపెనీ పనితీరు లక్ష్యాలను అధిగమిస్తే, ఈ విలువ రెట్టింపు అయి 252 మిలియన్ డాలర్లకు చేరవచ్చు. ఒకవేళ లక్ష్యాలను అందుకోకపోతే దీని విలువ సున్నా కూడా కావొచ్చు. దీనికి అదనంగా సుందర్ పిచాయ్‌కు మూడేళ్ల కాలానికి 84 మిలియన్ డాలర్ల విలువైన రిస్ట్రిక్టెడ్ స్టాక్, వార్షిక వేతనంగా 2 మిలియన్లు అందనున్నాయి.

కంపెనీలోని అటానమస్ (స్వయంప్రతిపత్త) వెంచర్లైన వేమో, వింగ్ ఏవియేషన్ వృద్ధికి ఊతమిచ్చేలా ఆల్ఫాబెట్ కొత్తగా 350 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్ ప్రోత్సాహకాలను కూడా ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా పిచాయ్‌కు వేమోలో 130 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్, వింగ్ ఏవియేషన్‌లో 45 మిలియన్ డాలర్ల షేర్లు లభిస్తాయి. ఈ వెంచర్ల పనితీరు అద్భుతంగా ఉంటే ఈ స్టాక్స్ విలువ 200 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. డ్రైవర్‌లెస్ కార్లు, డెలివరీ డ్రోన్స్ వంటి క్లిష్టమైన రంగాలలో సుందర్ పిచాయ్ నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని ఆల్ఫాబెట్ బోర్డు ఈ సందర్భంగా పేర్కొంది. 2015 ఆగస్టులో సీఈఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సుందర్ పిచాయ్, గూగుల్ మార్కెట్ విలువను దాదాపు ఏడు రెట్లు పెంచారు. అప్పట్లో 535 బిలియన్ డాలర్లుగా ఉన్న మార్కెట్ క్యాప్, ఇప్పుడు 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరింది. 53 ఏళ్ల పిచాయ్ 2004లో గూగుల్‌లో చేరి క్రోమ్, ఆండ్రాయిడ్ వంటి కీలక విభాగాలను విజయవంతంగా నడిపి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల (96.5 మిలియన్ డాలర్లు), యాపిల్ సీఈఓ టిమ్ కుక్ (74.3 మిలియన్ డాలర్లు) వంటి వారి వార్షిక వేతనాలతో పోలిస్తే పిచాయ్ ప్యాకేజీ చాలా అధికం కావడం గమనార్హం.

# ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి

అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం కొనసాగుతున్న సమయంలో, గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పారు. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఆస్తులపై బాంబు దాడులు చేస్తోంది. తమ దేశంపై దాడులు చేస్తే ప్రతిదాడి చేస్తామని గల్ఫ్ దేశాలు కూడా ఇరాన్‌ను హెచ్చరించాయి. ఇలాంటి తరుణంలో ఈ కీలక పరిణామం చోటు చేసుకుంది.ఇరాన్ ప్రజలను ఉద్దేశించి అధ్యక్షుడు ఒక టీవీ ఛానల్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై ఇక ఎలాంటి దాడులు జరగబోవని పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. అయితే పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం స్పందించే హక్కు ఉందని స్పష్టం చేశారు. "ఇరాన్ దాడికి గురైన పొరుగు దేశాలకు నా తరపున, ఇరాన్ ప్రజల తరపున క్షమాపణలు చెబుతున్నాను. గల్ఫ్ దేశాలపై ఇక దాడులు జరగవు. ఇరాన్‌పై ఆ దేశాలు దాడి చేయకపోతే తాము కూడా ఎలాంటి క్షిపణులు ప్రయోగించకూడదని తాత్కాలిక నాయకత్వ మండలి నిర్ణయించింది" అని ఇరాన్ స్టేట్ టీవీలో ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పెజెష్కియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

పొరుగు దేశాలపై దాడులు చేయడం తమ ఉద్దేశం కానేకాదని అన్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రం కాకూడదనే ఉద్దేశంతో గల్ఫ్ దేశాలపై దాడులు చేయకూడదని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.ఇరాన్ లొంగిపోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కూడా పెజెష్కియాన్ స్పందించారు. టెహ్రాన్ లొంగిపోయే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇరాన్ లేదా ఇరాన్ ప్రజలు లొంగిపోవాలనే వారి కలలను వారు సమాధి చేసుకోవాలని వ్యాఖ్యానించారు.

## కొత్తగా ఆలోచించే వారి కోసం

# 'క్రియేటివ్ సిటీ'

- మొదటి పేజి తరువాయి

స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అమరావతిలో 'గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్'ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో 'సాంకేతికత – సుపరిపాలన – భవిష్యత్తు' అనే అంశంపై చంద్రబాబు ప్రసంగించారు. 2016 నుంచి జరుగుతున్న ఈ సదస్సుకు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ అరుదైన గౌరవం దక్కించుకున్న చంద్రబాబు, ఏపీని 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ డెస్టినేషన్'గా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఏఐ డేటా సెంటర్లతో పాటు, ఆరోగ్య రంగంలో డ్రోన్ అంబులెన్సులు వంటి విప్లవాత్మక మార్పులు ఏపీలో ఇప్పటికే రియాలిటీలోకి వచ్చాయని గుర్తుచేశారు. పెట్టుబడుల కోసం వచ్చే పారిశ్రామికవేత్తలకు ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు ఇస్తూ, ఏపీని వ్యాపార అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దామని వివరించారు.

### అవకాశాల గనిగా భారత్

ప్రపంచవ్యాప్తంగా భారతీయులు కీలక స్థానాల్లో ఉన్నారని, అనేక దేశాల అభివృద్ధిలో మనవారి పాత్ర మరువలేనిదని సీఎం కొనియాడారు. టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్ వంటి రంగాలను వేగంగా అందిపుచ్చుకోవడం వల్లే భారత్ అగ్రగామిగా ఎదుగుతోందన్నారు. ఒకప్పుడు సిలికాన్ వ్యాలీ వంటి ప్రాంతాలకు భారత్ నుంచి మేధో వలస జరిగిందని, కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోందని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం, వనరులు ఉన్నచోటికే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని, త్వరలోనే భారత్‌కు 'రివర్స్ మైగ్రేషన్' మొదలవుతుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో 60 శాతం భారత్‌లోనే ఉండటం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భారత్ దూసుకుపోతోందని, భవిష్యత్తులో ఇతర దేశాలకు విద్యుత్ ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

### జనాభా నిర్వహణపై డేంజర్ బెల్స్

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు వృద్ధుల జనాభా పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి ఏపీలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చంద్రబాబు వివరించారు. ఒకప్పుడు ప్రజాప్రతినిధిగా కుటుంబ నియంత్రణ గురించి ప్రచారం చేసిన తాను, నేడు 'పాపులేషన్ మేనేజ్‌మెంట్' (జనాభా నిర్వహణ) ఆవశ్యకత గురించి మాట్లాడుతున్నానని తెలిపారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో ఫెర్టిలిటీ రేటు 1.5కి పడిపోయిందని, దీనిని కనీసం 2.1కి తీసుకురావడమే లక్ష్యంగా కొత్త పాలసీని తీసుకొచ్చామని చెప్పారు.పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజలంతా జనాభా వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, మూడో బిడ్డ పుడితే రూ.25 వేల ఆర్థిక సాయంతో పాటు, నెలకు రూ.1000 అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అలాగే చైల్డ్ కేర్ లీవ్ వంటి సౌకర్యాలపై కూడా ఆలోచన చేస్తున్నామన్నారు. గతంలో దేశానికి ఆస్తిగా ఉన్న పెద్ద కుటుంబాలు ఇప్పుడు మైక్రో ఫ్యామిలీలుగా మారిపోయాయని, ఈ విషయంలో ప్రజల ఆలోచనా దృక్పథాన్ని మార్చాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.

కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ సహా 110 దేశాల నుంచి వచ్చిన 2700 మందికి పైగా ప్రతినిధులు, మేధావులు, వ్యూహకర్తలు హాజరైన ఈ సదస్సులో చంద్రబాబు ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రంతోనూ, పొరుగు రాష్ట్రాలతోనూ సమన్వయం చేసుకుంటూ ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని సీఎం వివరించారు.

# భారత్‌లో పెరిగిన బిలియనీర్ల సంఖ్య...

- మొదటి పేజి తరువాయి

.గతేడాదితో పోలిస్తే ఈసారి కొత్తగా 24 మంది బిలియనీర్ల జాబితాలో చేరారు. దీంతో భారతీయ కుబేరుల మొత్తం సంపద 10 శాతం పెరిగి రూ.112.6 లక్షల కోట్లకు (112.6 ట్రిలియన్లు) చేరింది. 199 మంది సంపద పెరగ్గా, 109 మంది సంపద తగ్గడం లేదా స్థిరంగా ఉండటం గమనార్హం. ఈసారి సంప్రదాయ రంగాలకు మించి ఇతర రంగాల వారు కూడా జాబితాలో చోటు దక్కించుకున్నారు. అత్యధికంగా హెల్త్‌కేర్ రంగం నుంచి 53 మంది, ఇండస్ట్రియల్ గూడ్స్ నుంచి 36 మంది, కన్జ్యూమర్ గూడ్స్ నుంచి 31 మంది కొత్తగా ఈ జాబితాలో చేరారు. అయితే తక్కువ మంది ఉన్నప్పటికీ, ఇంధన రంగం (ఎనర్జీ) అత్యధిక సంపదను కలిగి ఉంది. కేవలం 8 మంది బిలియనీర్లే రూ.18.3 లక్షల కోట్ల సంపదతో దేశీయ కుబేరుల మొత్తం సంపదలో 16 శాతం వాటాను కలిగి ఉన్నారు. నగరాల వారీగా చూస్తే ముంబై 95 మంది బిలియనీర్లతో దేశంలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అయితే ఆసియా బిలియనీర్ క్యాపిటల్ హోదాను మాత్రం ముంబై కోల్పోయింది. 133 మంది కుబేరులతో చైనాలోని షెన్‌జెన్ నగరం ఆసియాలో టాప్ ప్లేస్‌కు చేరింది. ముంబైలో కొత్తగా 15 మంది బిలియనీర్లు చేరగా, ఇది న్యూయార్క్ (14), లండన్ (9) కంటే ఎక్కువ కావడం విశేషం. ఇక భారతీయ బిలియనీర్లలో మహిళల వాటా 7 శాతంగా ఉంది. మొత్తం 23 మంది మహిళా కుబేరుల వద్ద రూ.9.8 లక్షల కోట్ల సంపద ఉన్నట్లు హురున్ నివేదిక తెలిపింది. ప్రపంచ సగటు వయసు (65) కంటే భారతీయ బిలియనీర్ల సగటు వయసు (67) ఎక్కువగా ఉండటం గమనార్హం.

# హోర్ముజ్ జలసంధిలో ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి...

- మొదటి పేజి తరువాయి

షిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం.. భద్రతా కారణాల దృష్ట్యా హోర్ముజ్ జలసంధిలో రాకపోకలను నిషేధిస్తూ ఇరాన్ నేవీ హెచ్చరికలు జారీ చేసింది. అయితే 'ప్రైమా' ట్యాంకర్ ఈ నిబంధనలను ఉల్లంఘించి ముందుకు సాగడంతో, ఐఆర్‌జీసీ డ్రోన్ ద్వారా ఆ నౌకపై దాడి చేసింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణించిన తర్వాత, గత ఎనిమిది రోజులుగా హోర్ముజ్ జలసంధి తమ పూర్తి నియంత్రణలో ఉందని ఐఆర్‌జీసీ తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్ వంటి శత్రు దేశాలకు చెందిన లేదా వాటికి మద్దతు తెలిపే వాణిజ్య నౌకలను ఈ మార్గంలో అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అయితే, హోర్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేసినట్లు వస్తున్న వార్తలను ఇరాన్ ప్రభుత్వం ఖండించింది. అంతర్జాతీయ నిబంధనల ప్రకారమే నౌకల రాకపోకలు జరుగుతున్నాయని, జలసంధిని పూర్తిగా మూసివేసే ఆలోచన ప్రస్తుతానికి లేదని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్‌జాదే తెలిపారు. కానీ, యుద్ధ సమయంలో జలసంధిని నియంత్రించే హక్కు తమకు ఉందని, అమెరికా, ఇజ్రాయెల్ నౌకలు లేదా మారువేషంలో వచ్చే యుద్ధ నౌకలను మాత్రం సైనిక లక్ష్యాలుగా పరిగణించి అడ్డుకుంటామని ఇరాన్ సైన్యం హెచ్చరించింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ ప్రతీకార దాడులు తీవ్రతరం చేయడంతో ఈ ప్రాంతంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

# చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం

- మొదటి పేజి తరువాయి

డిసెంబర్ 31 వరకు సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలు, షార్ట్ ఫిలింలను పరిగణనలోకి తీసుకుని విజేతలను ఎంపిక చేశారు. ఈ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారాలను అందజేయనున్నారు.

**స్పెషల్ అవార్డులు:**

ఎన్టీఆర్ జాతీయ అవార్డు – చిరంజీవి
ఏఎన్నార్ అవార్డు – జయసుధ
పైడి జయరాజ్ అవార్డు – కమల్ హాసన్
నాగిరెడ్డి చక్రపాణి అవార్డు – అశ్వనిదత్

**ఫీచర్ ఫిల్మ్స్:**

ఉత్తమ చిత్రం – రాజు వెడ్స్ రాంబాయి
ఉత్తమ ద్వితీయ చిత్రం – దండోరా
ఉత్తమ తృతీయ చిత్రం – ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్‌షో
ఉత్తమ నటుడు – నాగ చైతన్య (తండేల్)
ఉత్తమ నటి – రష్మిక (ది గర్ల్‌ఫ్రెండ్)
ఉత్తమ దర్శకుడు – సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ బాలనటుడు – మాస్టర్ రోహన్ (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో)
ఉత్తమ సహాయ నటుడు – శివాజీ
ఉత్తమ సహాయనటి – భూమిక (యూఫోరియా)
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్ – తండేల్
ఉత్తమ సోషల్ మెసేజ్ సినిమా – కోర్ట్
ఉత్తమ ప్రజాదరణ చిత్రం – సంక్రాంతికి వస్తున్నాం
ఉత్తమ డాక్యుమెంటరీ – యూనిటీ
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ పరిచయ దర్శకుడు – సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్)
ఉత్తమ బాలల చిత్రం – అనగనగా
ఉత్తమ సంగీత దర్శకుడు – మార్క్ రాబిన్ (దండోరా)
ఉత్తమ గాయకుడు – అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ గాయని – సాహితీ (కన్నప్ప)
ఉత్తమ కథా రచయిత – గుణశేఖర్ (యుఫోరియా)
ఉత్తమ స్క్రీన్‌ప్లే – అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ లిరిసిస్ట్ – నందకిశోర్ (కుబేర)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ – కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్)
ఉత్తమ ఎడిటర్ – శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్).
ఉత్తమ సినీ గ్రంథం: ప్రభ (శూన్యం నుండి శిఖరాగ్రాలకు)
ఉత్తమ సినిమా విమర్శకుడు: హెచ్ రమేశ్ బాబు

# జగన్ మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది

- మొదటి పేజి తరువాయి

లోకేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇప్పటికే 1,048 కోట్ల రూపాయల నగదు లావాదేవీల జాడను వెలికితీసిందని గుర్తుచేశారు. ఒకవైపు ముఖ్యమంత్రి హోదాలో జగన్ మద్య నిషేధం గురించి ప్రసంగాలు చేస్తుంటే, మరోవైపు ఆయన అనుచరులు అక్రమ మద్యం ద్వారా వేల కోట్లు గడించారని మండిపడ్డారు. ఈ క్రమంలో వేలాది పేద కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రజలకు ఈ దోపిడీపై సమాధానం చెబుతారా? లేక మౌనంగా ఉండిపోతారా? అంటూ జగన్‌కు లోకేశ్ సూటి ప్రశ్న సంధించారు.

# ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్

- మొదటి పేజి తరువాయి

గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు సిట్ అధికారులు ఈ కేసులో దర్యాప్తును లోతుగా పరిశీలించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గను ఈ కేసులో రెండవ నిందితురాలిగా (ఏ–2) చేర్చారు. ఈ మేరకు సిట్ అధికారులు రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టులో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేశారు. పోలీసులు సమర్పించిన ఛార్జిషీట్‌ను, సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. లక్ష్మీ దుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోర్టు ఆదేశాలు వెలువడిన వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం లక్ష్మీ దుర్గ ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

# చంద్రబాబు పాపులేషన్ పాలసీపై షర్మిల సెటైర్

- మొదటి పేజి తరువాయి

సమంజసమని ఆమె ప్రశ్నించారు. "చంద్రబాబు పాపులేషన్ పాలసీ హాస్యాస్పదం. ఉన్న బిడ్డలకే దిక్కులేదు... ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనాలా? మీరిచ్చే బోడి 25 వేల కోసం మూడో బిడ్డను కనమంటారా? ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆటోలు తోలుకుంటూ, ట్యాక్సీ డ్రైవర్లుగా బ్రతుకుతున్నారు. రాష్ట్రంలో మీరిచ్చిన హామీలు అమలు కాలేదు. మీరు, జగన్ గారు కలిసి రాష్ట్రాన్ని 12 లక్షల కోట్ల అప్పుల కుప్ప చేశారు. సంక్షేమ పథకాలకు నిధులు లేవు. ఉద్యోగుల జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఆరోగ్య శ్రీ పథకానికి 3 వేల కోట్లు, ఫీజు రీయింబర్స్ పథకానికి 6 వేల కోట్లు బకాయిలు పెట్టారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో 15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపారు. మాఫియాలు చేసుకుంటూ, రాష్ట్రాన్ని దోచుకుంటూ... బిడ్డలను కనమని చెబితే ఎలా చంద్రబాబు గారూ?" అంటూ షర్మిల ధ్వజమెత్తారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం। అనకాపల్లి। అల్లూరి జిల్లా

# కుటుంబ సర్వే రెండు రోజుల్లో పూర్తి కావాలి



జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 07::**ఏకీకృత కుటుంబ సర్వే రెండు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. శనివారం మండల వారీగా కలెక్టర్ టిసి ద్వారా సమీక్షించారు. ఎక్కువ పెండింగ్ ఉన్న మండలాల అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో పూర్తి చేయని వారిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. జిల్లా పరిషత్ సి.ఈ.ఓ పర్యవేక్షించాలని గంట గంటకు రిపోర్ట్ సమర్పించాలని జి.ఎస్.డబ్ల్యు కో ఆర్డినేటర్ కు ఆదేశించారు. తాగు నీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య శాఖ, ఆర్ డబ్ల్యు.ఎస్, పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఉపాధి పనులలో లక్ష్యాలను సాధించాలని, వేతనాలు పెరగాలని, 100 రోజుల పని దినాలు కూడా పెరిగేలా చూడాలని ఉపాధి హామీ పి.డి కు ఆదేశించారు.

# సినీ రంగంలో రాణిస్తున్న ఏకలవ్య పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మురగాడ లోవరాజు








**స్టాఫ్ రిపోర్టర్ మాదిరి చంటిబాబు,చింతపల్లి/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మార్చి 7:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలోని ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మురగాడ లోవరాజు సినీ రంగంలో తన ప్రతిభను చాటుకుంటూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ మరోవైపు వెండితెరపై వివిధ పాత్రల ద్వారా ప్రేక్షకులను అలరిస్తూ ద్వంద్వ పాత్రను సమర్థంగా నిర్వర్తిస్తున్నారు.ఇప్పటివరకు ఆయన ఎనిమిది సినిమాల్లో నటించారు. వాటిలో రెండు సినిమాలు ఇప్పటికే విడుదల కాగా, మరో ఆరు సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. “ఊరు పేరు భైరవకోన” చిత్రంతో పాటు దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డి దర్శకత్వంలో, బాపిరాజు నిర్మించిన “కాక్రోచ్” సినిమాలో కొన్ని ఫైట్ సన్నివేశాల్లో కనిపించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.అంతేకాకుండా, దర్శకుడు గవిరెడ్డి శ్రీనివాస్ దర్శకత్వంలో, “కేజీఎఫ్” దర్శకుడు ప్రశాంత్ నీల్ నిర్మిస్తున్న “ఏజెన్సీ” సినిమాలో కూడా ఒక ప్రత్యేకమైన పాత్రలో కనిపించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మరో ఐదు సినిమాల్లో పూర్తి స్థాయి విలన్ పాత్రల్లో నటించే అవకాశాలు రావడంతో ఆయన ఆనందం వ్యక్తం చేస్తున్నారు.అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం మోకాషా కొత్తపట్నం గ్రామానికి చెందిన లోవరాజు చిన్న పల్లెటూరులో జన్మించి, కృషి, పట్టుదలతో సినీ రంగంలో అవకాశాలు సాధించారు. ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ సినీ రంగంలో కూడా తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకుంటున్నారు. విద్యా రంగం మరియు సినీ రంగాన్ని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్న లోవరాజుకు పలువురు అభినందనలు తెలుపుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని సినిమాల్లో ముఖ్యమైన పాత్రలు పోషించి ప్రేక్షకుల అభిమానాన్ని మరింతగా పొందాలని ఆకాంక్షిస్తున్నారు.

# నీతి ఆయోగ్ ప్రాంతీయ సెమినార్‌కు విశాఖ సిద్ధం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి





జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 07 :**ఆకాంక్షిత జిల్లాలు బ్లాకుల కార్యక్రమంలో భాగంగా మార్చి 9, 10 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్న నీతి ఆయోగ్ రీజినల్ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్ (దక్షిణాది) ఏర్పాట్లు పక డ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరి గిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు.ఈ సెమినార్‌కు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రా లతో పాటు అండమాన్‌నికోబార్ దీవుల కేంద్ర పాలిత ప్రాంతం నుంచి అధికారులు, ప్రతినిధు లు హాజరుకానున్నారని కలెక్టర్ తెలిపారు. అందువల్ల అన్ని ఏర్పాట్లను సమన్వయంతో, ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.మార్చి 9, 10 తేదీల్లో రుషికొండలోని ఎ 1 గ్రాండ్ ది కన్వెన్షన్ వేదికగా సెమినార్ జరగనుంది. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చే అధికారులు మార్చి 8న విశాఖపట్నం చేరుకుని, మార్చి 10న తిరిగి ప్రయాణం కానున్నారని చెప్పారు. వారికి రుషికొండ ప్రాంతంలోని హోటళ్లలో వసతి ఏర్పాటు చేయాలని, విమానాశ్రయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ప్రతినిధులకు స్వా గతం పలకాలని ఆదేశించారు. అలాగే రవాణా సౌకర్యాలు సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెమినార్ వేదిక వద్ద శుభ్రత, భద్రత, ప్రథమ చికిత్స, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు చెప్పారు. సెమినార్ ఏర్పాట్ల కోసం భీమిలి ఆర్డీవోను ఎ 1 గ్రాండ్ ది కన్వెన్షన్ వేదిక ఏర్పాట్ల ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు వెల్లడించారు.

వసతి, రవాణా, స్వాగతం, భద్రత, సమావేశ ఏర్పాట్లు తదితర అంశాలను సంబంధితన అధికారులు సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు. లైజన్ అధికారులు తమ బాధ్య తలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించా రు. డయాస్, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్, ఎల్ఈడి స్క్రీన్లు, అలంకరణలు తదితర వేదిక ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని అన్నారు. నెట్‌వర్కింగ్ సౌకర్యాలను కూడా ముందుగానే సిద్ధం చేయాలని తెలిపారు.సెమినార్ సంద ర్భంగా ఏర్పాటు చేసే కంట్రోల్ రూమ్ అధికారు లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అలాగే అతిథులకు విశాఖపట్నంలోని వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన ప్రదేశాలు, పార్కులు, ఆలయాలు తదితర ప్రాంతాలను సందర్శించేలా ప్రత్యేక సైట్‌సీయింగ్ ఏర్పాట్లు చేయాలని కూడా అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్వో శేషశైలజ, ఆర్డీవోలు సుధాసాగర్, సంగీత్ మాథుర్, స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ శ్రీనివాసరావు, సీపీవో శ్రీనివాస రావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీలేరులో ఘనంగా ఆంజనేయస్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకలు





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి7:**సీలేరులోని ఆంజనేయస్వామి ఆలయం మూడో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ నెల 5 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు శనివారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి. స్వామి అభిషేకాలకు పంచామృతాల ఉపయోగం చేశారు, మహిళా భక్తులతో లక్ష కుంకుమార్చన, నీరాజన, మంత్రపుష్పం, మహదాదీర్వాచన కార్యక్రమాలు నిర్వహించారు.మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. ఆలయ ధ్యానమందిరం నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసిన ప్రదీప్ రెడ్డిని ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# దుర్గమ్మ సేవలో మంత్రి అచ్చెన్నాయుడు

## – అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని కోరిన మంత్రి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 07 :** విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న కుంభాభిషేక మహోత్సవాలలో శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు మంత్రికి వేదాశీర్వచనం అందజేశారు. చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను మంత్రికి అందించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, అమ్మవారి దయాకటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. రైతులకు పంటలు బాగా పండాలని, వారికి గిట్టుబాటు ధరలు లభించి ఆనందంగా జీవించాలని, ప్రజలు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని, రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.



## ప్రభుత్వ బడి ఆణిముత్యం సౌరోతు రాము.

✷ సివిల్ ర్యాంకర్ రాముకి అభినందనలు తెలిపిన కలక్టర్, మంత్రి.



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 07:** ప్రభుత్వ పాఠశాలలో చదివి, పట్టుదలతో సివిల్స్‌లో ర్యాంకు సాధించిన సౌరోతు రాము వంటి ఆణిముత్యాలను ఎంత పొగిడినా తక్కువేనని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కొనియాడారు. రాము పదో తరగతిలో ఉన్నప్పుడు అప్పటి కలెక్టర్ శ్రీకాంత్ తాను చదువుతున్న ప్రభుత్వ పాఠశాలకు వచ్చినప్పుడు కలిగిన స్ఫూర్తితో నేడు సివిల్స్‌లో ర్యాంకు సాధించడం గొప్ప విషయం. తండ్రి మరణాన్ని ఒకవైపు దిగమింగుకుంటూనే ఉన్నత లక్ష సాధన కోసం అతడు శ్రమించిన తీరుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రెవెన్యూ విభాగంలో గ్రూప్ 2 ఉద్యోగం తో పాటు సివిల్స్ లో కూడా 463 ర్యాంకు సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేశారన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అభినందనలు తెలిపారు.

**సివిల్స్‌లో 463 ర్యాంకు సాధించిన సౌరోతు రాముకు మంత్రి అచ్చెన్నాయుడు అభినందనలు**

శ్రీకాకుళం జిల్లా సిగడాం మండలం నడిమివలస గ్రామానికి చెందిన సౌరోతు రాము సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 463వ ర్యాంకు సాధించడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన రాము కష్టపడి చదివి ఈరోజు సివిల్స్‌లో మంచి ర్యాంక్ సాధించడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. పట్టుదల, కృషి ఉంటే ఎలాంటి పరిస్థితులలోనైనా విజయాన్ని సాధించవచ్చని రాము నిరూపించాడని అన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సివిల్ సర్వీసెస్ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించడం శ్రీకాకుళం జిల్లాకు గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. ప్రతిభ, కృషి ఉంటే ఏ విజయాన్నైనా సాధించవచ్చని చెప్పడానికి సౌరోతు రాము మరో మంచి ఉదాహరణ అని ఆయన అన్నారు. భవిష్యత్తులో మంచి అధికారిగా దేశానికి, రాష్ట్రానికి సేవలందించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. అలాగే యువత అతని విజయాన్ని ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

## వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్న ప్రసాదం వితరణ





**గాజువాక: పెన్ పవర్, మార్చి 07:**జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీ గరుడాద్రి కొండపై వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో ఆలయ సేవకులు వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయంతో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత కవిత వైద్య శిబిరం త్రినేత్ర ఐ కేర్, శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి, మెడికవర్ వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది. ముఖ్య అతిథులు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామిని కొలిచిన వారికి కోరిన కోరికలు ఏడు వారాలు స్వామివారి దీక్షలు చేసి స్వామి వారి దీక్ష ప్రసాద్ రాజుచేసినవారికి

స్వామివారి నిదర్శనం ఉంటుందని అన్నారు. ఉత్తరాంధ్ర గాజువాక నియోజకవర్గంలో ఉత్తర ద్వారంలో వెలసిన వైకుంఠ వెంకటేశ్వరస్వామి ఆలయం ఇది ఒక్కటే స్వామివారిని ఏడు వారాలు దీక్షపుని స్వామి వారిని నిష్టగా పూజలు చేసే దీక్ష విరమించుకొని మనసులో కోరికలు ఏమైతే ఉన్నవా స్వామి వారికి చెప్పుకుంటే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. మార్చి 11 తేదీ నుండి 15 తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు ప్రకటనలో తెలియజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ మాధవాచార్యులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పెంటకోట రాజు, డాక్టర్ ఏం ఎస్ ఎల్ రాజు, హిమజ,మంగమ్మ,,లక్ష్మిమ్మ, జీవన జ్యోతి, గవర లక్ష్మి,నాగమణి,రమ, కళ, భావనామ్మ, కుమారి, పి.రాము, ప్రభావతి, సిహ్ .దుర్గా,నాగరత్నం, ఎస్.లక్ష్మి, సంతోష్, బంగారు నాయుడు మరియు ఆలయ సేవకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ కులాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. మార్చి 07 :** షెడ్యూల్డ్ కులాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా వారి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా పార్వతీపురం నియోజక వర్గంకు ఆయన శనివారం చేరుకున్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎం.శ్యామల ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు ఎస్సీ సంఘాల నుంచి వినతులను స్వీకరించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎవరైనా తమ సమస్యల గురించి వినతులు అందజేయాలనుకుంటే నిరభ్యంతరంగా పత్రాల రూపంలో సమర్పించవచ్చని సూచించారు. ఒకవేళ రాతపూర్వక వినతులు అందుబాటులో లేకపోయినా, సంబంధిత అధికారులకు తమ సమస్యలను మౌఖికంగా వివరించవచ్చని, తద్వారా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సమస్యల తీవ్రతను బట్టి క్షేత్రస్థాయి పరిశీలన చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించడమే జిల్లా యంత్రాంగం యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. తొలుత ఎస్సీ సంఘాల నాయకులతో కలిసి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎం.శ్యామల, జిల్లా స్థాయి అధికారులు, వివిధ ఎస్సీ సంఘాల నాయకులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ దువ్వాడలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





**కూర్మన్నపాలెం :పెన్ పవర్, మార్చి 07**

దువ్వాడలోని విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటోనమస్‌లోని వుమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ ప్రొటెక్షన్ సెల్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఆర్. శారద నాగార్జున్ ముఖ్య అతిథిగా పాల్గొని సమాజంలో మహిళల న్యాయ హక్కులు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె తన ఉపన్యాసంలో మహిళల న్యాయ పరిరక్షణ, లింగ సమానత్వం, మహిళల గౌరవం మరియు హక్కులను రక్షించడంలో చట్టాల ప్రాధాన్యత గురించి వివరించారు. అలాగే మహిళలకు అందుబాటులో ఉన్న వివిధ న్యాయ పరిరక్షణ చట్టాలను వివరించి, అన్యాయం మరియు వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు ధైర్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమం ద్వారా మహిళా సాధికారత, న్యాయ అవగాహన మరియు సమాజంలో భద్రమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని నిర్మించడంలో యువత పాత్ర ఎంత ముఖ్యమో విద్యార్థులకు తెలియజేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అతిథి ఉపన్యాసకురాలితో పరస్పరం చర్చిస్తూ మహిళల హక్కులు మరియు న్యాయ సహాయక వ్యవస్థలపై విలువైన సమాచారం తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని వుమెన్ ఎంపవర్‌మెంట్ & ప్రొటెక్షన్ సెల్ సమన్వయం చేసింది.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా.వి.మధుసూదన రావు మరియు వుమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ ప్రొటెక్షన్ సెల్ కోఆర్డినేటర్ డా. కె. మృదులా దేవి కార్యక్రమాన్ని అభినందించారు. విద్యార్థుల్లో మహిళల హక్కులు మరియు లింగ సమానత్వంపై అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, గౌరవం మరియు భద్రత కలిగిన వాతావరణాన్ని నిర్మించడానికి యువత ముందుకు రావాలని వారు విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగంగా మేడూరు గ్రామంలో మెగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ .






చింతపల్లి ఏ ఎస్ పి నవ జ్యోతి మిశ్రా.

**చింతపల్లి పెన్ పవర్ మార్చి 7.** అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడూరు గ్రామంలో ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగంగా మెగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందని చింతపల్లి అడిషనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ నవజ్యోతి మిశ్రా తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మరియు ఈగల్ చీఫ్ ఆకే రవి కృష్ణ ఐ జి పి పర్యవేక్షణలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం ఆపరేషన్ వజ్రప్రహార్ అన్నారు. దీనిలో భాగంగా చింతపల్లి మండలం అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధి మేడూరు గ్రామంలో శనివారం మెగా కార్డెన్ మరియు సెర్చ్ ఆపరేషన్ విస్తృతంగా నిర్వహించడం జరిగిందన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది హాట్స్పాట్ ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం అక్రమ రవాణా మరియు సంబంధిత నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాలు అద్దె ఇల్లు ఖాళీ భవనాలు మరియు ఇతర అనుమానస్పద ప్రదేశాలలో తమ సిబ్బంది సోదరులు నిర్వహించారు అన్నారు. ఈ కార్డె న్ మరియు సెర్చ్ ఆపరేషన్ లో భాగంగా మొత్తం 50 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ప్రజల వివరాలు వాహనాలు వివరాలు అనుమానాస్పద వ్యక్తులను పరిశీలించడం జరిగిందన్నారు. ఆపరేషన్ లో భాగంగా సుమారు 150 మంది వ్యక్తులను తనిఖీ చేయడం జరిగిందని 55 వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని 34 వాహనాలను గుర్తించడం జరిగిందన్నారు. గుర్తింపు లేని 34 వాహనాలను సీట్ చేయడం జరిగిందన్నారు. సీజ్ చేసిన వాహనాలు యొక్క పత్రాలను చూపించి వాహనాలను తీసుకెళ్లవచ్చునన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సామాజిక చట్టపరమైన దుష్పరిణామాల వల్ల ప్రజలకు అవగాహన కలిగించామన్నారు. గంజాయి ఇతర మాదకద్రవ్యాలు వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని కుటుంబ వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కార్యక్రమంలో భాగంగా పోలీస్ అధికారులు సిబ్బంది మరియు ప్రజలతో కలిసి ఆపరేషన్ వజ్రప్రహార ప్రతిజ్ఞ నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ రహిత సమాజంగా మార్చడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఎస్సై జి. వీరబాబు, అన్నవరం ఎస్సై సాయిరాం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## టెక్నికల్ అసిస్టెంట్లుని ప్రభుత్వం ఆదుకోవాలి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. మార్చి 07 :** పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన భవనంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ టెక్నికల్ అసిస్టెంట్లగా మండలానికి ఇద్దరు చొప్పున 16 మంది పనిచేస్తున్నప్పటికీ గడిచిన మూడు సంవత్సరాలుగా జీతాలు పెండింగ్ ఉండగా ఈ విషయంపై పలు మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళినప్పటికీ పలితం లేదని, తమ ఆవేదననీ అర్థం చేసుకుని జిల్లా ప్రజా ప్రతినిధులు సమస్యని సిఎం, రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ల దృష్టికి తీసుకెళ్ళి తమకు రావలసిన పెండింగ్ జీతాలు వచ్చేలా చెయ్యాలని గిరిజన నాయడుకు తుమ్మల అప్పలరాజును కోరిన టెక్నికల్ అసిస్టెంట్లు. వారి సమస్యని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం అయ్యేంత వరకు మాకు అండగా ఉంటానని అప్పలరాజు హామీ ఇచ్చారు

## కులాల మధ్య కుంపట్లు రాజేస్తున్న వైసీపీ నాయకులకు బుద్ధి చెప్పాలని రాష్ట్ర ప్రజలకు టిడిపి శ్రేణులు పిలుపు



**గాజువాక పెన్ పవర్, మార్చి 07** పారిశ్రామిక ప్రాంతం పాత గాజువాక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో టిడిపి శ్రేణులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను టిడిపి కాపు సంఘం నాయకులు ఖండించారు.

కూటమి ప్రభుత్వం కాపు లకు అన్యాయం చేస్తుందని అంబటి అసత్య ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు.

వైసీపీ ని కాపు కాసే నాయకుడు అని హేద్దేవా చేశారు.

మాటలు అసభ్యకరంగా ఉండడం వలన జైలు కి వెళ్లారని.

కూటమి ప్రభుత్వం కాపు ల పక్షపాతి అన్నారు.

చంద్రబాబు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి కాపులను ఆర్థికంగా ఆదుకున్నారని కితామని ఇచ్చారు.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కాపు లను అణగతొక్కిందని,

అంబటి రాంబాబు వంగవీటి రంగా తో పోల్చడం దారుణమని వాపోయారు.

కాపు లు మద్దతు లేదున కాబట్టే కాపు కార్డుఉపయోగించుకుంటున్నారని

జగన్ కాపులను ఓటు బ్యాంకు గానే వాడుకుంటున్నారని

ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని మెలగాలని

కులాలు మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్న అంబటి రాంబాబు కు కాపులు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

విలేకరుల సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి బోండా జగన్, తోటరత్నం, 98వార్డు కార్పొరేటర్ పి వి నరసింహా, విశాఖ పార్టీ ప్రధాన కార్యదర్శి లోడల కృష్ణ, మీడియా కోఆర్డినేటర్ సాయి రెడ్డి పోతన రెడ్డి 26 వార్డు అధ్యక్షుడు ముక్క కిషోర్, తదితరులు పాల్గొన్నారు,

# సీతంపేట అడ్వెంచర్ పార్కులో సందడి







**ఫ్లవర్ గార్డెన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. (సీతంపేట) మార్చి 07 :** పర్యాటక రంగానికి చిరునామాగా మారుతున్న సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి శనివారం సందడి చేశారు. పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన ఫ్లవర్ గార్డెన్‌ను ఆయన రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. వివిధ రకాల దేశీ, విదేశీ పుష్పాలతో ముస్తాబైన ఈ గార్డెన్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీతంపేటను ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని అన్నారు. అడ్వెంచర్ పార్కులో అత్యాధునిక సౌకర్యాలతో పాటు మన సంప్రదాయ క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. పర్యాటకులు ప్రకృతిని ఆస్వాదించడంతో పాటు ఇక్కడి సాహస క్రీడల్లో పాల్గొని మానసిక ఉల్లాసాన్ని పొందాలని ఆకాంక్షించారు.

**స్వయంగా క్వాడ్ బైక్ నడిపిన కలెక్టర్**

అనంతరం పార్కులో పర్యాటకుల వినోదం కోసం కొత్తగా ప్రవేశపెట్టిన క్వాడ్ బైక్ (ఔఱఱం దీఱఎవ) సేవలను కలెక్టర్ ప్రారంభించారు. ప్రారంభించడమే కాకుండా, స్వయంగా బైక్ నడుపుతూ పార్కు అంతా కలియతిరిగారు. సాహస క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతకు ఇది మంచి అనుభూతినిస్తుందని ఆయన అన్నారు. పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన పంచ్ బ్యాగ్, గానుగ రాట్నంను ప్రారంభించిన కలెక్టర్, క్రీడల వల్ల శారీరక దృఢత్వం పెరుగుతుందని తెలిపారు. అదేవిధంగా, మన ప్రాచీన గ్రామీణ క్రీడలను పునరుద్ధరించే క్రమంలో భాగంగా గిల్లీ దండా క్రీడను ఆయన ప్రారంభించారు. స్వయంగా గిల్లీ దండా ఆడి అందరినీ ఉత్సాహపరిచారు.

ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఐటీడీఏ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.




## 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల ప్రోత్సాహ కార్యక్రమం





**విశాఖ మార్చి 7(పెన్ పవర్)**రోటరీ క్లబ్ మరియు ఆయుర్ జీవ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డా. బి.ఆర్. అంబేద్కర్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల ప్రోత్సాహ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫ్లాంకులు, పెన్లు, స్కేలు, పెన్సిల్స్, పౌచ్‌లు, ఇరేసర్లు, షార్పనర్లు పంపిణీ చేశారు. అలాగే బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించి " బాలల హక్కులు- చట్టాలు" పుస్తకాన్ని విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో ఆయుర్ జీవ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఎస్. సుబ్బలక్ష్మి మాట్లాడుతూ "విద్యే మనిషి జీవితాన్ని మార్చగలిగే గొప్ప శక్తి." విద్యార్థులు పరీక్షల సమయంలో భయపడకుండా ముందుగా ప్రశ్నపత్రాన్ని జాగ్రత్తగా చదవాలని, తెలిసిన సమాధానాలను స్పష్టంగా రాయాలని సూచించారు. ఎల్లప్పుడూ సానుకూల ఆలోచనలతో ముందుకు సాగాలని కోరుతూ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు.

రోటరీ క్లబ్ అధ్యక్షులు అల్తాఫ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ధైర్యంగా ముందుకు సాగాలని, ఈ పరీక్షలు వారి భవిష్యత్తుకు పునాది అని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రోత్సాహం అందించిన రోటరీ క్లబ్ మరియు ఆయుర్ జీవ ఫౌండేషన్ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, ఆయుర్ జీవ ఫౌండేషన్ సభ్యురాలు పవిత్ర పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అంబేద్కర్ స్కూల్ సుభప్రదమ్ గా పూర్తి చేశారు.

## కొల్లేరు లోని అరుదైన జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలి






- సైబీరియన్ పక్షుల పుట్టిల్లు కొల్లేరు
- పక్షులు గూళ్ళు పెట్టే చెట్లు పెంచాలి
- విద్యార్థులు కొల్లేరు సరస్సును సందర్శించాలి
- పి. నీలకంఠ, ఎపి స్టేట్ కోఆర్డినేటర్, నేషనల్ గ్రీన్ కార్ప్స్

**విశాఖ మార్చ్ 7(పెన్ పవర్)**కొల్లేరు లోని అరుదైన జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలి అని నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఎపి స్టేట్ కోఆర్డినేటర్ పి. నీలకంఠ అని పిలుపునిచ్చారు. శనివారం ఉదయం ఏలూరు జిల్లా కైకలూరు మండలం లోని చైతన్య విద్యా సంస్థ విద్యార్థులు , ఎపి ఎన్ జి సి ప్రతినిధులు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ సభ్యులు ఉమ్మడిగా సందర్శించారు. ఈ సందర్భంగా నీలకంఠ మాట్లాడుతూ సైబీరియా నుంచి వేల కిలోమీటర్ల ప్రయాణం చేసి కొల్లేరు వచ్చే పక్షులకు పుట్టిల్లు కొల్లేరు కాబట్టి ఆ పుట్టినిల్లు పరిరక్షణకు మనం అందరం కలిసి కృషి చేయాలని కోరారు. పక్షులు గూళ్ళ పెట్టే దేశీయ వృక్షాలను విస్తారంగా పెంచాలని అన్నారు. దేశం లోని విద్యార్థులు అందరూ కొల్లేరు సరస్సును సందర్శించాలి, ఇక్కడ ఉన్న అరుదైన జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలి అని వివరించారు.

ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కొల్లేరు గురించి, అక్కడ గుడ్లు పెట్టి పొదిగి పిల్లల్ని చేసే పక్షులు గురించి విద్యార్థులకు వివరించారు. దీని పరిరక్షణకు కృషి చేస్తున్న వారి గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఎపి ఎన్ జి సి సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మాట్లాడారు.

## లబ్ధిదారులకు ఇంటి స్థలాలను కేటాయించాలి.






**టిడిపి మండల నాయకుడు ఆనందరావు.**

**చింతపల్లి పెన్ పవర్ మార్చి 7.** చింతపల్లి పంచాయతీలోని పీఎం ఆవాస్ యోజన ఇల్లులు మంజూరైన 42 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలను కేటాయించాలని చింతపల్లి తెలుగుదేశం పార్టీ గ్రామ నాయకుడు రీమల ఆనందరావు అన్నారు. ఈ ఆయన మాట్లాడుతూ పిఎం ఆవాస్ యోజన పథకం కింద 42 మంది లబ్ధిదారులకు ఇల్లులు మంజూరైనప్పటికీ ఇంటి స్థలాలు కేటాయించకపోవడం వల్ల ఇంటి నిర్మాణాలు జరగలేదన్నారు. ఇళ్లను మంజూరు చేసినప్పటికీ, ఇంటి స్థలాలను కేటాయించకపోవడం వల్ల లబ్ధిదారులు ఇల్లను నిర్మించుకోలేకపోయారు అన్నారు. ఈ విషయమై స్థానిక తహసిల్దార్ కే శంకర్రావు, పంచాయతీ సెక్రటరీ తకు వినతిపత్రాలను ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికైనా లబ్ధిదారులకు ఇంటి స్థలాలను కేటాయించాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నాయకుడు లక్కోజు నాగభూషణం, పడాల గాంధీ, ముత్యం చిన్నబాబు, చంద్రశేఖర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## విశాఖలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





**విశాఖ దక్షిణ మార్చి 7(పెన్ పవర్)**

విశాఖపట్నంలోని కేజీహెచ్ ఎగ్జామినేషన్ హాల్లో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కుటుంబ బాధ్యతలు నిర్వహించడంతో పాటు ఉద్యోగాల్లోనూ సమర్థంగా రాణిస్తున్న మహిళల సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధి, కుటుంబ బాంధవ్యాల పరిరక్షణలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.

కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురు మహిళలను సాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ షరీనా రహమాన్, బీజేపీ మాజీ అధ్యక్షురాలు దీపిక, ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, డిజిఓ రీజనల్ డైరెక్టర్ రాధారాణి, డాక్టర్ సునీత, డాక్టర్ పద్మ, స్థానిక జనసేన పార్టీ వార్డు అధ్యక్షురాలు యజ్ఞశ్రీ, సీనియర్ నేత ప్రభాకర్, నర్సెస్ అసోసియేషన్ అధ్యక్షురాలు భవాని, కార్యదర్శి వరలక్ష్మి, కూటమి నేతలు జగదీష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.ఎ

## చిన గొలుగొండపేట గ్రామంలో స్వచ్ఛంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం...










- గ్రామాల పరిశుభ్రతే ప్రభుత్వ ధ్యేయం......
- ప్రతి గ్రామం చెత్త రహిత గ్రామంగా మారాలి....
- తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ.....

**నాతవరం,పెన్ పవర్ (మార్చి 07)**గ్రామీణ ప్రాంతాల పరిశుభ్రత ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ అన్నారు.శనివారం మండలంలో గల చిన గొలుగొండపేట గ్రామంలో ప్రతి శనివారం నిర్వహించే స్వచ్ఛంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ అధికారులు,ప్రజాప్రతినిధులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్నటువంటి గ్రామాలు శుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా వారి దగ్గర ఉన్న చెత్త నుండి సంపద సృష్టించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఆయన అన్నారు.నెలలో ఒకరోజు ప్రతి గ్రామానికి వెళ్లి ఏదైతే పొడి చెత్త ఉందో వాటిని తీసుకొని దానికి సంబంధించిన సరుకులను తీసుకోవడమనేది ఒక రకమైన వినూతనమైన కార్యక్రమమని, ఇది రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందని అన్నారు.ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా దగ్గర దగ్గరగా సుమారు 300 నుండి 400 రూపాయల వరకు విలువైన సరుకులు వివిధ రూపాల్లో ఎవరైతే చెత్తను తీసుకువస్తారో వారికి ఇవ్వడం జరుగుతుంది అన్నారు. ప్రజలలో బాగా అవగాహన కలిగించినట్లయితే ప్రతి గ్రామం చెత్తరహిత గ్రామంగా మారుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మంగ వేణి,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ,డిప్యూటీ ఎంపీడీవో కే మూర్తి బాబు,పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యాన శాస్త్రవేత్తగా డాక్టర్ కె వెంకట సతీష్ నియామకం.



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 7.** స్థానిక ఉద్యాన పరిశోధనా స్థానం (హెచ్ ఆర్ ఎస్). ఉద్యాన శాస్త్రవేత్తగా డాక్టర్ కె వెంకట సతీష్ నియమితులయ్యారు. స్థానిక పరిశోధనా స్థానం శాస్త్రవేత్త అధిపతి డాక్టర్ చెట్టి బిందు ఇన్ సర్వీస్ పిహెచ్డీకి ఎంపికైన నేపథ్యంలో నెలరోజుల క్రితం ఆమె రిలీవ్ అయ్యారు. ప్రస్తుతం ఆమె వెంకటరమణ గూడెం ఉద్యాన విశ్వవిద్యాలయంలో పీహెచ్డీ చేస్తున్నారు. దీంతో నెల రోజులుగా ఉద్యాన పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం పంత్రి మామిడి కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి శాస్త్రవేత్త పిసి వెంగయ్యకు ఇన్చార్జి బాధ్యతలను అప్పగించారు. హెచ్ఆర్ఎస్ లో శాస్త్రవేత్తల కొరత వల్ల పరిశోధన నిలిచిపోవడంతో పరిశోధన శాస్త్రవేత్తలు వారం రోజులు క్రితం ఇద్దరు శాస్త్రవేత్తలను నియమించారు. అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న ట్రాక్టర్ కె వెంకట సతీష్ ను బదిలీపై ఇక్కడకు వచ్చారు. శుక్రవారం ఆయన ఉద్యాన శాస్త్రవేత్తగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ ఎస్ ఫణి చంద్ర విధుల్లో చేరారు. మరో ఐదు రోజుల్లో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి రమణ విధుల్లో చేరుతారని ఇన్చార్జి సిపి వెంగయ్య తెలిపారు.ు

## గంజాయి నిర్మూలనకు అంతఃకరణ శుద్ధితో ప్రతిజ్ఞ చేస్తున్నాం.

✹ హుకుంపేట ఎస్సై దుర్గాప్రసాద్



**హుకుంపేట పెన్ పవర్ మార్చి 7 :** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం కేంద్రంలో స్థానిక ఎస్సై దుర్గాప్రసాద్. యువకులకు.

మత్తు పదార్థాలు వల్ల కలిగే నష్టాలను వివరించారు. అలాగే గంజాయి వంటివి ఉపయోగించరాదని. సేవించేవారు గాని అమ్మేవారు పండించే వారు ఉంటే. తమకు తెలియజేయాలని ఆయన. అంతేకాకుండా అంతర్రాష్ట్ర ప్రజలు ఎవరైనా గ్రామాల్లో తిష్ట వేస్తే. పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు అనుమానితుల పై నిఘా ఉందని ఈ సందర్భంగా ఆయన అన్నారు అలాగే వాహనాలపై త్రిబుల్ రైడింగ్ చేయొద్దని మత్తు పదార్థాలను సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురికావచ్చని అలాంటి సందర్భాల్లో కుటుంబాలకు తీవ్ర నష్టాలు కలుగుతాయని అయన అన్నారు అంతేకాకుండా మత్తు పదార్థాలు సేవించబడమని అలాంటి వారికి సహకరించమని గంజాయి వంటి గ్రామాల్లో పండించమని పండించే వాళ్ళుకు సహకరించమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దుర్గాప్రసాద్. మరియు సిబ్బంది పాల్గొన్నారు

## గృహ నిర్మాణాలపై సమీక్షా సమావేశం....

✹ జిల్లా హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.శ్రీనివాసరావు....



**నాతవరం, పెన్ పవర్ (మార్చి 07)**ఈ నెల 31 నాటికి పీఎంఏవై కింద మంజూరైన గృహాలను పూర్తి చేసేలా దృష్టి సారించాలని జిల్లా హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.శ్రీనివాసరావు ఆదేశించారు. నాతవరం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం హౌసింగ్ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కారణాలపై ఆరా తీశారు. ఇంకా పెండింగ్లో ఉన్న వాటిని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు నిర్మాణాల పురోగతిని పర్యవేక్షించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జోగారావు పాల్గన్నారు.

## ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలి....

✹ మండల అభివృద్ధి అధికారి ఎం.సత్య శ్రీనివాస్.....



**నాతవరం,పెన్ పవర్ (మార్చి 07)**గృహ యాజమానులు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలని నాతవరం మండల ప్రత్యేకాధికారి జీ.మంగవేణి కోరారు. నాతవరం మండలం మన్యపురట్ల పంచాయతీలో ఎంపిడిఒ ఎంఎస్.శ్రీనివాస్తో కలిసి శనివారం పర్యటించారు.ఈ సందర్భంగా ఇంటి పన్ను బకాయిలు వసూళ్ల ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఇంటి పన్నుల బకాయిలు సకాలంలో చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ నెల 15వ తేదీ నాటికి శతశాతం ఇంటి పన్ను బకాయిలు వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కే.మూర్తిబాబు,పంచాయతీ కార్యదర్శి వి. బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకున్న చంద్రబాబు ... కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అండగా కూటమి ప్రభుత్వం .. కిమిడి రామ్ మల్లిక్ నాయుడు



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 07**:చీపురుపల్లి మండలం, గొల్లలములగం గ్రామంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, యువ నాయకులు శ్రీ కిమిడి రామ మల్లిక్ నాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గుణపూరు మహాలక్ష్మి ఇంటికి వెళ్లి అతడు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

కిడ్నీ సమస్యతో డయాలసిస్ చేయించుకుంటున్న గుణపూరు మహాలక్ష్మి గారికి, వృద్ధాప్య పెన్షన్ రూ. 4,000/- స్థానంలో, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు పెంచిన రూ. 10,000/- ల డయాలసిస్ పెన్షన్ను రామ మల్లిక్ నాయుడు స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "గతంలో మీకు వృద్ధాప్య పెన్షన్ 4 వేలు వచ్చేది. కానీ ఇప్పుడు మీకు కిడ్నీ సమస్య వచ్చి డయాలసిస్ కి వెళ్తున్నారు కాబట్టి, మీ వైద్య ఖర్చుల కోసం చంద్రబాబు నాయుడు గారు ఈ నెల నుంచి మీకు పదివేల రూపాయల పెన్షన్ (₹10,000/-) ఇస్తున్నారు. కష్టకాలంలో ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వాన్ని గుర్తుపెట్టుకోండి" అని భరోసా కల్పించారు.

పేదల కష్టం తెలిసిన నాయకుడు మన చంద్రబాబు నాయుడు అని కిమిడి రామ్ మల్లిక్ నాయుడు అన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటుగా తెలుగుదేశం చీపురుపల్లి మండల పార్టీ అధ్యక్షులు రౌతు కామ నాయుడు గొల్లలములగం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గడే సన్యాసప్పల నాయుడు ఇతరనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గూడెం కాలనీలో బోడకొండమ్మ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 7:**గూడెంకొత్తవీధి మండలంలోని గూడెం కాలనీలో బోడకొండమ్మ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్) క్రికెట్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానికంగా ఈనెల 14 నుంచి 17 వరకు నిర్వహించనున్న బోడకొండమ్మ శాంభరీదేవి మహోత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ను నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో స్థానిక ఎస్సై సురేశ్, జనసేన అరకు పార్లమెంట్ కన్వీనర్ గొర్లె వీర వెంకట్ టాస్ వేసి టోర్నమెంట్ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడిన వారు యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, ఇలాంటి పోటీలు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా స్ఫూర్తిని పెంచుతాయని పేర్కొన్నారు.తొలి రోజు జరిగిన మ్యాచ్లలో మొత్తం నాలుగు జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్కు గ్రామ యువతతో పాటు స్థానిక ప్రజలు కూడా పెద్ద ఎత్తున హాజరై ఆటగాళ్లను ప్రోత్సహించారు. ఉత్సవాల సందర్భంగా రాబోయే రోజుల్లో మరిన్ని మ్యాచ్లు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సుర్ల వీరేంద్ర, గబులంగి గణేష్,పేసా కమిటీ సభ్యులు లకే రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## 10 పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేటట్లు ఉపాధ్యాయులు కృషి చేయాలి

**ఎంఈఓ పాటి సింహాచలం ఉపాధ్యాయులకు హితవు**



**కొయ్యూరు, పెన్ పవర్ మార్చి 7 :** మండలంలోని జిటిడబ్ల్యూ స్కూల్ గర్ల్స్ కస్తూరిబా పాఠశాలను సందర్శించిన ఎంఈఓ పాటి సింహాచలం పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులందరూ శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులంతా కృషిచేయాలని ప్రత్యేక శ్రద్ధతో మానసిక ఆందోళన చెందకుండా విద్యార్థులందరూ పరీక్షలకు సన్నద్ధం చేయాలని ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలంటూ విద్యార్థులకు పాఠాలు బోధించారు విద్యార్థులను ఏవిధంగా పరీక్షలకు సన్నద్ధం చేయాలి అనే దానిపై మెలకువలు ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన ఉద్యోగుల సంఘం మండల కమిటీ ఎన్నిక



✹ అధ్యక్షునిగా డివి కాళేశ్వరరావు

**గూడెం కొత్త వీధి పెన్ పవర్ మార్చి 7:**గిరిజన ఉద్యోగుల సంఘం మండల కమిటీ ఎన్నిక శనివారం మండల కేంద్రంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి శేషాద్రి సమక్షంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్. రామకృష్ణ ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల అధ్యక్షుడిగా డి.వి. కాళేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కె. మల్లేశ్వరరావును సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం వారికి ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవ అధ్యక్షుడిగా పి. రామరాజు, ఉపాధ్యక్షుడిగా ఎస్. వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీగా ఎస్. వసంత్కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్. వైకుంఠం ఎన్నికయ్యారు. మహిళా ఉపాధ్యక్షులుగా రామలక్ష్మి, వి. లలితకుమారి, ధవళేశ్వరి ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు. అదనంగా 30 మంది కార్యవర్గ సభ్యులు కూడా ప్రమాణం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్. కోటిబాబు, ఎస్. వినోద్కుమార్, ఎం. వెంకటరమణ, సాగిన పూర్ణచంద్రరావు, ఎం. గణేశ్వరరావు, ఎం. కామేశ్వరరావు, ఎస్. పెద్దబ్బాయి, రమణనాయుడు, దేవుడు, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జనగణన2027 నిర్వహణకు యంత్రాంగం సిద్ధం కావాలి






జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 07 :** కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న 16 వ జనాభా గణన జనగణన2027 ప్రక్రియను జిల్లాలో అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. శనివారం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన "గృహాల జాబితా మరియు గృహ వసతుల గణన"కు సంబంధించిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన ప్రక్రియ దేశ అభివృద్ధి ప్రణాళికలకు అత్యంత కీలకమని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే అధికారులు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని, సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో జనగణనను సమర్థవంతంగా పూర్తి చేయడానికి సంబంధిత అధికారులు పూర్తిస్థా యిలో సన్నద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు.జనగణన ప్రక్రియలో భాగంగా బ్లాక్ల ఏర్పాటు, మ్యాపుల్లో గ్రామ సరిహద్దుల నిర్ధారణ, జనాభా అంచనా విధానం వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన అవసరమని ఆయన తెలిపారు. చట్టబద్ధమైన ఈ ప్రక్రియను ఎన్నికల నిర్వహణ తరహాలోనే అత్యంత క్రమ బద్ధంగా నిర్వహించాలని అధికారులకు సూ చించారు. జనగణన ద్వారా సేకరించే సమా చారం ప్రభుత్వాల అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు పునాదిగా నిలు స్తుందని ఆయన వివరించారు.

ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ సమన్వయం తో పనిచేస్తే జనగణన ప్రక్రియ విజయవంతంగా పూర్తి అవుతుందని అన్నారు.

జనగణనలో తొలి దశగా గృహాల జాబితా మరియు గృహ వసతుల గణన 2026 మే 1 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. అనంత రం వ్యక్తిగత జనగణన ప్రక్రియను 2027 ఫిబ్ర వరి 9 నుంచి 28 వరకు చేపట్టనున్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జిల్లా అటవీ అధికారి రవీంద్ర ధామ, జనగణన జాయింట్ డైరెక్టర్ దయాసాగర్, ఇన్చార్జి డి.ఆర్.ఓ. శేషశైలజ, సి.పి.ఓ. శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవో లు, తహసీల్దార్లు, మాస్టర్ శిక్షకులు పాల్గొన్నారు.

## నిమ్మల గొంది, పారికల గ్రామాల్లో మాదకద్రవ్యాల పై సెర్చ్ ఆపరేషన్...!






**కొయ్యూరు, పెన్ పవర్ మార్చి 7 :** అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నిమ్మల గొంది, పారికల గ్రామాల్లో మెగా కార్డిన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, అక్రమ రవాణా సంబంధిత నేరాలను అరికట్టడమే ధ్యేయంగా ఈ తనిఖీలు చేపట్టారు. కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు ఎస్సై కిషోర్ వర్మ సిబ్బందితో కలిసి టీములుగా ఏర్పడి గుర్తించిన హాట్స్పాట్ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలు జరుగుతున్నట్లు అనుమానం ఉన్న చోట, ఇల్లు అనేక అనుమానస్పద ప్రాంతాలు పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లో భాగంగా 25 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించి ప్రజల వివరాలు, వాహన వివరాలు అనుమానస్పద వ్యక్తులపై పరిశీలన చేపట్టారు. ఈ ఆపరేషన్ లో భాగంగా 230 మంది వ్యక్తులను, 40 వాహనాలను తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించారు. నేరాలను సంబంధించి ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం ప్రజలతో సమావేశమైన కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు ఎస్సై కిషోర్ వర్మ మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల వినియోగంపై వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు వినియోగం వలన యువత భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. అలాగే కుటుంబం పై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో గంజాయి మాదకద్రవ్యాల సంబంధిత సమాచారం ఉంటే తమకు సమాచారం అందించాలన్నారు. అనంతరం మాదకద్రవ్యాల వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేయించారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రజల సమాచారం ఎంతో ముఖ్యమన్నారు.

## జాతీయ అందత్వ నివారణ కార్యక్రమం.

డాక్టర్ డి. అనూష.



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 7.** జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏటా నిర్వహించి గ్లాకోమా (నీటి కాసులు). అవగాహన వారోత్సవాలను నేటి నుండి మార్చి 14 వరకు నిర్వహించనున్నట్లు చింతపల్లి ఏరియా ఆసుపత్రి కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ డి అనూష ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజులపాటు నిర్వహించే ఈ వారోత్సవాలు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి ప్రాంతీయ ఆసుపత్రి చింతపల్లిలో నేత్ర వైద్యుల పర్యవేక్షణలో ప్రత్యేక గ్లాకోమా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ముఖ్యంగా రక్తపోటు మధుమేహం ఉన్నవారు కళ్లద్దాలు వాడుతున్న వారు అలాగే 40 సంవత్సరాలు వయస్సు పైబడిన వారు గ్లోకోమా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆమె సూచించారు. అదనంగా జిల్లా గ్రామీణ ప్రాంతాలలో పారామెడికల్ సిబ్బంది ద్వారా గ్లోకోమా అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించబడుతున్నాయని తెలిపారు. చింతపల్లి ఆసుపత్రిలో కంటి వైద్యురాలు అందుబాటులో ఉన్నందున పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవగాహన కార్యక్రమం సద్వినియోగం చేసుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆమె కోరారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో 144 సెక్షన్ అమలు





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి7:** ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని జీకేవీధి ఎస్సై సురేశ్ తెలిపారు. జీకేవీధి గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. నిర్వాహకులకు, అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. పరీక్ష జరుగుతున్న సమయంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. ఆ సమయంలో కేంద్రం పరిసరాల్లో గుంపులుగా కనిపిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా



**విశాఖమార్చ్ 7(పెన్ పవర్)**ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా సమాజ సేవలో ముందుండి సేవలందిస్తున్న పలువురు మహిళలను సన్మానించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర పోలీస్ కమిషనర్ శంక బ్రతా బాగ్చీ, విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు, గంటల శ్రీను బాబు, దాడి సత్యనారాయణ హాజరై మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మహిళల సాధికారత, సమాజ అభివృద్ధిలో వారి పాత్రపై అతిథులు ప్రసంగించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## గుండెపోటుతో ఉపాధ్యాయుని మృతి.



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 7.** చింతపల్లి మండలం దొంగలో యా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న అడపా పరమేశ్వరరావు గుండెపోటుతో మరణించారని ఎం ఈ ఓ పి.వి. వి ప్రసాద్ తెలిపారు. మండలంలోని కిన్నెర్ల గ్రామానికి చెందిన పరమేశ్వరరావు మృదుస్వభావి, వృత్తి అంకితభావంతో పనిచేస్తారన్నారు. మృతునికి భార్య ,కుమార్తె ,కుమారుడు ఉన్నారు. అప్పటివరకు దొంగలోయ గ్రామంలోని పాఠశాలలో , పిల్లలకు పాఠాలు చెబుతూ ఎంతో ఉత్సాహంగా ఉన్న పరమేశ్వరరావు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో మృతి చెందారన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కాగా ఆయన స్వగ్రామం కిన్నర్ల గ్రామంలో అంత్యక్రియలు జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఉపాధ్యాయుడు పరమేశ్వరరావు మృతి పట్ల పలువు ఉపాధ్యాయులు, మిత్రులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

## కేజీహెచ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**మహిళల సేవలను కొనియాడిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్**

**విశాఖ దక్షిణం పెన్ పవర్, మార్చి 07 :**కింగ్ జార్జ్ హాస్పిటల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సస్ అసోసియేషన్ నిర్వహిం చిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడు కలు శనివారం కేజీహెచ్ ఎగ్జామినేషన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్న మహిళల కృషి ప్రశం సనీయం అని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి, కుటుంబ బాంధవ్యాల పరిరక్షణకు మహిళలు అధిక ప్రాధాన్యత ఇస్తారని ఆయన తెలిపారు.

ప్రభుత్వ సేవలో ఉన్న మహిళలు తమ విధు లను నిబద్ధతతో నిర్వర్తిస్తూ కుటుంబాన్ని కూడా సమానంగా చూసుకుంటున్నారని కొనియాడా రు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతి భ కనబరిచిన పలువురు మహిళలను ఎమ్మెల్యే సాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షరీనా రహమాన్, బీజేపీ మాజీ అధ్యక్షురాలు దీపిక, ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, డీజీఓ రీజనల్ డైరెక్టర్ రాధారాణి, డాక్టర్ సునీత, డాక్టర్ పద్మ, స్థానిక జనసేన పార్టీ వార్డు అధ్యక్షురాలు యజ్ఞశ్రీ, సీనియర్ నాయకులు ప్రభాకర్, నర్సస్ అసోసి యేషన్ అధ్యక్షురాలు భవాని, కార్యదర్శి వరలక్ష్మి, కూటమి నాయకులు జగదీష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహనతోనే బాలికలకు రక్షణ






**ఓపెన్ హౌస్ లో అవగాహన కల్పించిన ఎస్సై సురేష్**

గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మార్చి 7:పోలీసు విధులు, బాలికలు, మహిళలకు ఉన్న ప్రత్యేక చట్టాలపై గిరిజన విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నామని స్థానిక ఎస్సై సురేశ్ తెలిపారు. జీకేవీధి పోలీస్ స్టేషన్లో శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయుధాల వినియోగం, రికార్డుల నిర్వహణను తెలియజేశారు. చట్టాలు తెలుసుకొని అప్రమత్తంగా ఉంటే దాడుల నుంచి రక్షించుకోవచ్చని సూచించారు. ముఖ్యంగా గుడ్ టచ్ బ్యాడ్ టచ్ తెలియక మోసపోతున్న బాలికలు అధికంగా ఉన్నారని తెలిపారు. అలా మోసపోకుండా తల్లిదండ్రులు ఇంట్లోనే పిల్లలకు బ్యాడ్ టచ్ గుడ్ టచ్ పై అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లలో, పాఠశాలల్లో, మార్కెట్ లలో, బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న యాప్ సాయం తీసుకోవాలన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

**ఎంపీడీవో రమణబాబు సూచన**



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 7:**మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రమణబాబు శనివారం కోరారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఈ వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలను వినతి పత్రాల ద్వారా వేదికకు అందించగా, సంబంధిత అధికారుల ద్వారా వీలైనంత త్వరగా పరిష్కారం తీసుకుంటామని వివరించారు. గత రెండు వారాలుగా ఒక్క వినతిపత్రం రాలేదని ఆయన పేర్కొన్నారు. గిరిజనులు ఈ వేదికను వినియోగించుకొని సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు.

## లైన్మెన్ బి. సింహాచలానికి జాతీయ ఉత్తమ లైన్మెన్ అవార్డు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 07 :**ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)కు చెందిన గాజువాక లైన్ ఇన్‌స్పెక్టర్ బి. సింహాచలం జాతీయ స్థాయి లో ఉత్తమ లైన్మెన్ అవార్డు సాధించినట్లు సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ తెలిపారు. లైన్మెన్‌గా అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు ఆయ నకు ఈ గౌరవం లభించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.విద్యుత్ సరఫరాను వ్యవసాయ, వాణిజ్య, పరిశ్రమలు, గృహ వినియోగదారుల కు నిరంతరంగా అందించేందుకు కృషి చేస్తున్న లైన్మేన్ల సేవలను గుర్తించి వారికి కృతజ్ఞతలు తెలపడం కోసం కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ కు చెందిన సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఆధ్వ ర్యంలో ప్రతి సంవత్సరం మార్చి నెలలో "థ్యాంక్ ఎ లైన్మెన్ లైన్మెన్ దివస్" కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నట్లు సీఎండీ తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ పరిధిలోని అన్ని సర్కిళ్లలో లైన్మెన్ దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించినట్లు చెప్పారు.

వర్షాలు, వరదలు, తుఫాన్లు వంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అంకితభావంతో రేయింబవ ళ్లు శ్రమిస్తూ విద్యుత్ వెలుగులు అందించేం దుకు లైన్మేన్లు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని సీఎండీ పేర్కొన్నారు. లైన్మెన్ దినోత్సవం సంద ర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచిస్తూ, లైన్మేన్ల భద్రత కోసం ఈపీడీసీఎల్ అన్ని చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. శనివారం ఢిల్లీలో జరిగిన లైన్మెన్ దివస్ కార్యక్రమంలో సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథా రిటీ చైర్మన్ ఘనశ్యామ్ ప్రసాద్ చేతుల మీదుగా బి. సింహాచలం ఉత్తమ లైన్మెన్ అవార్డును అం దుకున్నారు. అలాగే ఉత్తమ లైన్మేన్లుగా ప్రశంస లు పొందిన విజయనగరం సర్కిల్‌కు చెందిన కె. రాజు, వెస్ట్ గోదావరి సర్కిల్‌కు చెందిన జె. జాన కిరాముడుకు కూడా అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఉత్తమ లైన్మేన్లకు సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్‌తో పాటు సంస్థ డైరెక్టర్లు టి.వి. సూర్యప్రకాశ్, టి. వనజ, ఎస్. హరిబాబు, సీజీఎం వి. విజయలలిత శు భాకాంక్షలు తెలిపారు.




## అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు మృతి...!

**సంతాపం తెలిపిన పలువురు ఉపాధ్యాయులు**



కొయ్యూరు, పెన్ పవర్ మార్చి 7 : మండల కేంద్రంలోని బాయ్స్-1 పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న బాలాకుమారి శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె స్వగ్రామం రేవళ్ళులో ఈ ఘటన జరిగింది. కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో ఉన్నారని తోటి సిబ్బంది తెలిపారు. ఆమె మృతి వార్త తెలిసిన వెంటనే ఉపాధ్యాయులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పాఠశాలలో ఆమె సేవలు గుర్తు చేసుకుంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## నాతవరంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు....

**ఎస్సై వై .తారకేశ్వరరావు....**





**నాతవరం, పెన్ పవర్ (మార్చి 07):** శనివారం మండల కేంద్రమైన నాతవరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్థానిక ఎస్సై వై తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మూడు రోడ్ల జంక్షన్ వద్ద జడ్పీ హై స్కూల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి,మానవహారం చేశారు.నాతవరం మండలంలో వివిధ రంగాలలో విశేషంగా సేవలందిస్తున్న మహిళా మూర్తులను ఘనంగా సత్కరించారు.వికలాంగుల విద్యార్థులకు అండగా నిలుస్తూ వారికి అవసరమైన సహాయం అందిస్తూ వారి ఆలనా పాలన చూసుకుంటూ సేవలు అందిస్తున్న నాతవరం గ్రామానికి చెందిన ఏ. లచ్చమ్మను,స్వచ్ఛంద్ర సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సమాజానికి సేవలు అందిస్తున్న గొలుగొండపేట గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త టీ,సత్యవతి, మహిళ పోలీస్ కానిస్టేబుల్ గా నాతవరం పోలీస్ స్టేషన్ లో విధుల్లో క్రమశిక్షణతో మర్యాదపూర్వకంగా ఫిర్యాదులు రిసీవ్ చేసుకుని అన్ని డ్యూటీలలో మగవారితో సమానంగా చురుగ్గా పాల్గొంటున్న బి,రాజేశ్వరి, ఇటీవల రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన నాతవరం విద్యార్థులను జాతీయ స్థాయికి తీర్చిదిద్దడంలో విశేష కృషిచేసిన జడ్పీహెచ్ఎస్ స్కూల్ కు చెందిన పి.అనురాధ పిడి వారును స్థానిక ఎస్సై వై .తారకేశ్వరరావు ఘనంగా సన్మానించి,చిరు సత్కారం అందించి,బహుమతి ప్రధానం చేసి, హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# చింతపల్లి డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు.





- మహిళా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, ముందుకు సాగాలి.
- ఎంపీడీవో సిహెచ్ సీతామహాలక్ష్మి.

**పెన్ పవర్, మార్చి 7**మహిళా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఆ దిశగా ప్రయత్నించి విజయాలు సాధించాలని స్థానిక ఎంపీడీవో సిహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయభారతి అధ్యక్షతన ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా అధికారులు ఎంపీడీవో , ఐసిడిఎస్ సిడిపిఓ సిహెచ్. శ్రీదేవి, ఏ టి డబ్ల్యూ ఓ బి జయ నాగలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ గడుతూరి స్వర్ణలత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత కేక్ ను కట్ చేసి ఒకరికొకరు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళా విద్యార్థినులను ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. మహిళలు పురుషుల కంటే ఎక్కడ తక్కువ కాదని మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని కోరారు. సమాజంలో మహిళ పాత్ర గొప్పదని గృహిణిగా తల్లిగా భార్యగా ఉద్యోగిగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించడంలో మహిళలకు సాటి లేదన్నారు. మహిళల హక్కులు చట్టాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు మహిళల హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు మహిళా అధ్యాపకులకు నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులను అతిథులు అందజేశారు. విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం ప్రిన్సిపాల్ విజయభారతి ఎంపీడీవో సీతామహాలక్ష్మి, సిడిపిఓ శ్రీదేవి, ఏ టి డబ్ల్యూ ఓ జయ నాగలక్ష్మి, ఏఈఈ స్వర్ణలత, సూపర్వైజర్లు జయభారతి గౌరీ లను అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కే లీలా పావని, సంతోషి, కేజియా, ఉమా ,మోరి శ్రావణి, డాక్టర్ రమణ, శ్రీనివాస రావు,ఈశ్వర్, జగత్ రాయి, పిడి శివరాంకుమార్ పాల్గొన్నారు.

# బత్తునూరు కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేయాలి

- జనసేన నేతల విజ్ఞప్తి



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 7:**గూడెం కొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధిలోని బత్తునూరు గ్రామంలో జనసేన పార్టీ నాయకులు శనివారం గ్రామస్తుల సమస్యలను పరిశీలించారు. కాలువపై వంతెన లేకపోవడం కారణంగా సుమారు 10 గ్రామాల ప్రజలు, పాఠశాలకు వెళ్లే చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ పెద్ద రామారావు తెలిపారు. జనసేన మండల ఉపాధ్యక్షుడు బత్తుల సిద్ధార్థ మార్క్, పంచాయతీ ఆర్గనైజర్ నాడేలి సత్యారావు, కార్యదర్శి కొర్ర కృష్ణారావు తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు హామీ ఇచ్చారు.

# దారకొండ ప్రాంతం నుండి తొలి వైద్యురాలిగా డాక్టర్ తురుక. దివ్య




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 7**:అల్లూరి సీతారామరాజు జిల్లా, జీకేవీధి మండలం, దారకొండ పంచాయతీ, ఏనుగుభైలు గ్రామానికి చెందిన తురుక.గోపాల్,లక్ష్మి దంపతుల ఏకైక కుమార్తె డాక్టర్ తురుక. దివ్య.2026లో శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లో ఎంబిబిఎస్ పూర్తి చేశారు.డాక్టర్ దివ్య, దారకొండ ప్రాంతం నుంచి మొదటి వైద్యురాలిగా మైలురాయిని సాధించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘనంగా అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ, నిరుపేదలకు వైద్య సేవలు అందించే దిశగా పనిచేయాలన్న సంకల్పం ఉన్నదని తెలిపారు.కుటుంబ విషయాల్లో, తండ్రి గోపాల్ ట్రాన్స్కోలో లైన్ ఇన్స్పెక్టర్‌గా విశాఖపట్నం లో స్థిరపడ్డారు.భార్య గృహిణి,వారికి ఇద్దరు సంతానం.కుమారుడు బిటెక్ పూర్తి చేసాడు, కుమార్తె డాక్టర్ దివ్య 10వ తరగతి వరకు గాజువాక చైతన్య స్కూల్లో, ఇంటర్ శ్రీచైతన్య కాలేజ్‌లో పూర్తి చేశారు.

# సృష్టి వరల్డ్ స్కూల్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు






**గాజువాక :పెన్ పవర్, మార్చి 07:**విద్యాసంస్థ ఫౌండర్ సుశీలా రాణి పై ప్రత్యేక కథనం

వ్యవసాయదారుల కుటుంబంలో పుట్టి ఉన్నత విద్యను అభ్యసించి, విద్యావేత్తగా, కౌన్సిలర్ గా, మెంటర్ గా, గైడ్ గా, సైకాలజిస్ట్ గా, ఎదుగుతూ, అన్నపూర్ణ చారిటబుల్ సొసైటీని స్థాపించి, తద్వారా చైతన్య పబ్లిక్ స్కూల్ విద్యాసంస్థల స్థాపకురాలుగా , వ్యవస్థాపకురాలుగా మరియు డైరెక్టర్ గా కొనసాగుతున్నారు పీసపాటి సుశీలా రాణి. 1995 వ సంవత్సరములో కేవలం 33 మంది విద్యార్థులతో ప్రారంభమైన సంస్థ అతి తక్కువ కాలంలోనే 250 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ విద్యాసంస్థ అంచెలంచెలుగా ఎదుగుతూ 3,000 మంది విద్యార్థులతో పాఠశాలను నడిపించి అచంచలమైన దృఢ సంకల్పముతో విద్యాసంస్థలను నడిపిస్తు , స్ఫూర్తి, నైపుణ్యముతో నేడు సృష్టి వరల్డ్ స్కూల్ సి. బి. ఎస్. ఇ. సిలబస్ తో ఆమె ముప్పై సంవత్సరాలకు పైగా విద్యా నైపుణ్యాలకు నాయకత్వం వహిస్తూ, ప్రపంచవ్యాప్తంగా తమదైన ముద్ర వేస్తూ లెక్కలేనంతమంది విద్యార్థులకు దిశా, మార్గనిర్దేశం చేస్తున్నారు. ఆమె దూరదృష్టి గల నాయకత్వంలో, 21వ శతాబ్దపు విద్యా నైపుణ్యాలు మరియు ముందుగా ఆలోచించే మనస్తత్వంతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటునందించాలన్న సదుద్దేశముతో రూపొందించబడిన వినూత్న కార్యక్రమాలే – ఐఐటి ఫౌండేషన్ కోచింగ్, ఐ ఏ ఎస్. ఫౌండేషన్ కోచింగ్, ఎంటర్ప్రెన్యూర్‌షిప్, రోబోటిక్స్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అని దృఢంగా నమ్ముతారు.

పది ఎకరాలు గల సువిశాలమైన పాఠశాల ప్రాంగణంలో సువిశాలమైన తరగతి గదులు, పాఠశాల ప్రాంగణంలో పచ్చగా ఉండే పర్యావరణం, స్వచ్ఛమైన గాలి, వెలుతురు చూస్తే ఆమె పర్యావరణానికి, పచ్చదనానికి ఎంతటి ప్రాముఖ్యతను ఇస్తున్నారో ప్రత్యక్షంగా చూస్తే అర్థమవుతుంది. పాఠశాల ప్రాంగణంలో రకరకాల జాతులకు చెందిన సుమారు 2,000 మొక్కలు, చెట్లు, మరియు 400 లకుపైగా జాతులతో ఉద్యానవనం చూపరులకు స్వర్గధామంలా ఉంటుంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ఆర్ ఐ ఎన్ ఎల్ వారిచే 17 సార్లు ఇకో అవార్డు గెలుచుకున్న ఏకైక విద్యాసంస్థ సృష్టి వరల్డ్ స్కూల్. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇకో క్యాంపస్ గుర్తింపు పొంది, ప్రశంసలను అందుకొని స్థిరమైన నాయకత్వానికి నిదర్శనగా నిలిచారు . ఆమె ప్రతి విద్యార్థి పట్ల శ్రద్ధచూపి, మెంటల్ గా, గైడ్ గా, సైకాలజిస్ట్ గా సృష్టి వరల్డ్ స్కూల్ కుటుంబంలో భాగంగా చూస్తారు. 90 శాతానికి పైగా మహిళలే ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి, బోధనేతర సిబ్బంది మరియు పాఠశాల నిర్వాహకులను గైడ్ చేస్తూ ఐకమత్యంతో పని చేయుటకు ఆమె యొక్క శక్తి సామర్థ్యాలు, నాయకత్వ లక్షణాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి .

విద్యాసంస్థలు నడపటం అంత సులభం కాదని, ఈ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, ఈ విద్యాసంస్థను విజయవంతంగా నడిపిస్తున్నారు. హుధుద్ తుఫాను సమయంలో కూడా పాడైపోయిన పర్యావరణాన్ని, పచ్చదనాన్ని పునరుద్ధరించారు. తన తల్లి అయిన అన్నపూర్ణమ్మతో కలిసి పాఠశాల ప్రాంగణంలో సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం, కూరగాయలు పండించడం లాంటివి చేయించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కూడా విద్యలో భాగంగా సేంద్రియ వ్యవసాయ పద్ధతులను బోధిస్తూ ప్రత్యక్షంగా సేంద్రియ వ్యవసాయాన్ని ఎలా పండించాలో చేసి చూపిస్తున్నారు.

సృష్టి వరల్డ్ స్కూల్ ఇటీవల ఉత్తమ విద్య మరియు పాఠ్యాంశ బోధన శ్రేష్ఠతకు అంతర్జాతీయ అవార్డును గెలుచుకున్నారు. ఇది ఆమె దృఢమైన నిబద్ధతకు, సమగ్ర అభివృద్ధికి ప్రతిబింబం.

ఆర్థికంగా వెనుకబడి, అవసరమైన విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నారు. ఈ విద్యాసంస్థలో చదివిన ఎందరో విద్యార్థులు దేశ విదేశాలలో అత్యున్నతమైన స్థానాలలో స్థిరపడ్డారు కనుక సుశీల రాణి మేడమ్ ని అందరూ మాతృమూర్తిగా భావిస్తారు.

విద్యావేత్తలకు మించి, ఆమె సమగ్ర శ్రేయస్సును, ఆరోగ్యకరమైన అభ్యాసాల ద్వారా మనస్సు మరియు శరీరాన్ని సమతుల్యంగా ఉంచుకోవడం, యోగా మరియు మిల్లెట్ ఆధారిత పోషకాహారాన్ని అభివృద్ధి చేస్తూ, సమతుల్య జీవితంలో కీలకమైన అంశాలుగా ప్రోత్సహించడాన్నే ఆమె సమర్థిస్తారు. క్రమశిక్షణ, పట్టుదల, నిబద్ధత, దృఢ సంకల్పం, వాత్సల్యం, ధాతృత్వం, క్షమాగుణం, నిరంతర శ్రమ, మార్గదర్శకత్వం, పరోపకారం, ఫలితాలను సాధించడంలో సుశీలా రాణిలి కి ఎవరూ సాటి రారు. ఆమెకు ఆమే సాటి మేటి అని పలువురు విద్యావేత్తలు మేధావి వర్గం తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం విశేషం.







# ఆపరేషన్ "వజ్రప్రహార్"లో భాగంగా సీలేరులో కార్డన్ సెర్చ్ ఆపరేషన్





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 7:**జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు చింతపల్లి ఎఎస్పీ పర్యవేక్షణలో, గూడెం కొత్తవీధి సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో సీలేరు పంచాయతీ పరిధిలో "ఆపరేషన్ వజ్రప్రహార్" కార్యక్రమం నిర్వహించబడింది. శనివారం లైఖన్‌పూర్, చందూర్‌పల్లి ప్రాంతాల్లో విస్తృతంగా కార్డన్ డే సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు.ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, సంబంధిత నేరాలపై అరికట్టడమే లక్ష్యంగా పోలీసు బలగాలు హాట్‌స్పాట్ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాయి. ఎస్ఐ యాసీన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన దుష్పరిణామాలు ఉంటాయని, ప్రజలు ఏపీఈగిల్ టోల్ ఫ్రీ 1972 ద్వారా సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు కలిసి "ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" నిర్వర్తించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడతామని హామీ ఇచ్చారు.

# దుచ్చరపాలెంలో రైతుల కోసం ప్రత్యేక రెవిన్యూ అవగాహన సదస్సు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 7:**మండలంలోని రింతాడ పంచాయతీ సచివాలయం-2 దుచ్చరపాలెం గ్రామంలో రైతుల భూ సమస్యలను తెలుసుకోవడం, పరిష్కారం సూచించడానికి ప్రత్యేక రెవిన్యూ అవగాహన సదస్సు నిర్వహించారు. గూడెం కొత్తవీధి డిప్యూటీ తాహసిల్దార్ దుమంతి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులు తమ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. డిటి సత్యనారాయణ సమస్యల పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో అశోక్, డి.ఏ. కుమార్, వార్డ్ మెంబర్ సాగిన జోగిపడాల్, ఉపాధ్యక్షులు సాగిన భీమేశ్వర్ పడాల్, జనసేన నాయకులు బ్రహ్మాజీ పడాల్ పాల్గొన్నారు.

# కోరమాండల్‌లో మెగా సైన్స్ ఫెయిర్

- 27 పాఠశాలల నుంచి 155 ప్రాజెక్టులతో విద్యార్థుల ప్రతిభ ప్రదర్శన









**ములగాడ, పెన్ పవర్,మార్చి 07 :**విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 58వ వార్డులో ఉన్న కోరమాండల్ ఇంటర్నేష నల్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మ కంగా నిర్వహించే "మెగా సైన్స్ ఫెయిర్" ఈ ఏడాది కూడా శనివారం ఘనంగా జరిగింది. కంపెనీ ఆవరణలో నిర్వహించిన ఈ సైన్స్ ఫెయి ర్‌లో 27 పాఠశాలల నుంచి సుమారు 155 ప్రాజెక్టులతో విద్యార్థులు పాల్గొని తమ ప్రతి భను ప్రదర్శించారు.ఈ పోటీలకు ముందు కోరమాండల్ సంస్థకు చెందిన కెమికల్ ఇంజినీర్ల బృందం ప్రతి పాఠశాలలో ఇంట్రా స్కూల్ స్థాయి పోటీలను నిర్వహించింది. ఆ పోటీల్లో ఎంపికైన ఉత్తమ ప్రాజెక్టులలో నుంచి ప్రతి పాఠశాల నుం చి ఐదు చొప్పున మొత్తం ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి కంపెనీ ఆవరణలో నిర్వహించిన తుది సైన్స్ ఫెయిర్‌కు తీసుకువచ్చారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోరమాండ ల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ యూనిట్ హెడ్ మ్యాన్యుఫాక్చరింగ్ సి.హెచ్. శ్రీనివాసరావు హాజరై సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు సాగి దేశ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. అలాగే సంస్థ హెచ్ఆర్ హెడ్ కె.వి.వి.వై.ఎస్.నారాయణ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.పోటీల్లో విజే తలుగా నిలిచిన విద్యార్థులకు సంస్థ ప్రతినిధు లు బహుమతులు ప్రదానం చేశారు.

మొదటి స్థానం, జెడ్పీపీ హైస్కూల్, గంగవరం కూల్ హెల్మెట్ ప్రాజెక్ట్, రెండవ స్థానం, మరియ దాస్ స్కూల్, శ్రీహరిపురం కార్బన్ ప్యూరిఫైయ ర్ ప్రాజెక్ట్, మూడవ స్థానం, సాయి చైతన్య స్కూల్, నక్కవానిపాలెం గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్

విజేతలకు కోరమాండల్ యూనిట్ హెడ్ చి. శ్రీనివాసరావు మరియు హెచ్.ఆర్ హెడ్ కె.వి.వి.వై.ఎస్. నారాయణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, ఉపా ధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com